ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
కృష్ణా జిల్లా వార్తలు
మంగళవారం 4 ఫిబ్రవరి 2025





ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య నివాసంలో వేచి ఉన్న కౌన్సిలర్లు

నందిగామలో రగడ

మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నేటికి వాయిదా

- అధిష్ఠానం ఎంపిక చేసిన అభ్యర్థిపై ఎమ్మెల్యే సౌమ్య అసంతృప్తి
- తన ప్రమేయం లేకుండా ఎలా ఎంపిక చేశారంటూ ఆగ్రహం
- తాను సూచించిన వారికే పదవినివ్వాలని పట్టు
- ఎన్నికకు వెళ్లనివ్వకుండా కౌన్సిలర్ల నిలుపుదల
- కోరం లేక వాయిదా పడిన చైర్‌పర్సన్ ఎన్నిక
- రాత్రి 9 గంటల సమయంలో మంత్రి నారాయణ ఫోన్
- సౌమ్యకు అభయం.. సద్దుమణిగిన వివాదం
- నేటి ఎన్నిక లాంఛనమే..
- ఎమ్మెల్యే, ఎంపీ మధ్య ఆధిపత్య పోరు వల్లేనా..?

6

రాజకీయ పరిణామాల నడుమ నందిగామ మునిసిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నిక సోమవారం అర్ధంతరంగా నిలిచింది. టీడీపీ కౌన్సిలర్లు ఎవరూ సోమవారం నాటి ఎన్నికకు హాజరు కాకపోవటంతో మంగళవారానికి వాయిదా పడింది. ఉదయం జరిగిన పరిణామాల్లో అభ్యర్థి ఎంపికపై అధిష్ఠానం అందజేసిన బీఫాంపై ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మండిపడ్డారు. తాను సూచించిన అభ్యర్థికే పట్టం కట్టాలని, లేదంటే రాజీనామా చేస్తానని ఆమె చెప్పడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. రాత్రి 9 గంటల సమయంలో మంత్రి నారాయణ కలగజేసుకుని సౌమ్యతో ప్రత్యేకంగా మాట్లాడటంతో వివాదం సద్దుమణిగింది. అధిష్ఠానం సూచించిన అభ్యర్థి కాకుండా.. సౌమ్య ఇష్టానికే నిర్ణయాన్ని వదిలేయడంతో పరిస్థితి చక్కబడింది. ఇక.. మంగళవారం నాటి ఎన్నిక లాంఛనం కానుంది. కాగా, ఎంపీ చిన్ని, ఎమ్మెల్యే సౌమ్య మధ్య ఆధిపత్య పోరే ఈ వివాదానికి కారణమని తెలుస్తోంది.

ఆ నలుగురి రూటే సపరేటు!

కలెక్టరేట్, ఆర్డీవో కార్యాలయ ఉద్యోగుల రెవెన్యూ లీలలు

అడిగినంత ఇస్తేనే ఫైళ్లకు మోక్షం.. లేకుంటే ఏళ్ల తరబడి అక్కడే..

- పనులు అవ్వక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న ప్రజలు
- డిప్యుటేషన్‌పై వచ్చి చక్రం తిప్పుతున్న సదరు ఉద్యోగులపై సర్వత్రా వ్యక్తమవుతున్న విమర్శలు



కలెక్టరేట్‌లో డిప్యుటేషన్‌పై వచ్చిన వివిధ విభాగాల్లోని ఉద్యోగుల హవానే కొనసాగుతోంది. మండలాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను కలెక్టరేట్‌లో, ఆర్డీవో కార్యాలయంలో పనిచేయమని తీసుకువస్తే ఇదే అదనుగా భావించిన వారు తమదైన శైలిలో పరిపాలన అంశాల్లో చక్రం తిప్పుతున్నారు. భూమికి సంబంధించిన పనులు చేయాలంటే ఇంత ఖర్చు అవుతుందని ఓ రేటు నిర్ణయిస్తున్నారు. అనుకున్న నగదు చేతికి అందే వరకు ఆ ఫైళ్లపై అనేక కొర్రీలు పెడుతున్నారు. నగదు అందగానే ఆగమేఘాలపై ఆ ఫైల్స్ క్లియర్ చేస్తున్నారు. తమదారిలోకి రానివారి ఫైళ్లను తొక్కిపెట్టి ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. నిబంధనల మేరకు పనిచేస్తున్నట్లుగా ఉన్నతాధికారుల వద్ద నటిస్తూ తెరవెనుక మాత్రం తమ వసూళ్ల పర్వం కొనసాగిస్తున్నారు. వీరి తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: కలెక్టరేట్, కలెక్టరేట్ ప్రాంగణంలోని ఆర్డీవో కార్యాలయంలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న నలుగురైదుగురు ఉద్యోగుల కనుసన్నల్లోనే కలెక్టరేట్‌లో కార్యకలాపాలన్నీ నడుస్తున్నాయి. కలెక్టరేట్‌లో భూములకు సంబంధించిన వ్యవహారాలు చూసే సెక్షన్‌లో ఒకరు డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. గతంలో ఒక మాజీ ఎమ్మెల్యే, ఆయన బంధువులకు సంబంధించిన భూమి వ్యవహారంలో పెద్ద మొత్తంలో నగదు తీసుకుని పనిచేయకపోగా, ఇంకా నగదు కావాలని సదరు ఉద్యోగి పట్టుబట్టడంతో ఈ వ్యవహారం బయటకు పొక్కి వివాదాస్పదమైంది. మచిలీపట్నం మెడికల్ కళాశాలకు సమీపంలోని ఓ భూమి వ్యవహారంలో కూడా పనిచేయకుండా తొక్కిపెట్టారు. తాను అడిగినంత నగదు ఇచ్చిన తర్వాత ఈ భూమి వ్యవహారాన్ని గుట్టు చప్పుడు కాకుండా పరిష్కరించడం గమనార్హం.

బదిలీ చేయిస్తే మళ్లీ తిరిగి అదే సీట్లోకి రాక

సదరు ఉద్యోగి పనితీరు వివాదాస్పదం కావడంతో గతంలో పనిచేసిన కలెక్టర్ ఈ ఉద్యోగి వ్యవహారశైలిపై విచారణ చేయించి, గుడివాడ రెవెన్యూ డివిజన్‌కు బదిలీ చేయించారు. కొంతకాలం పాటు అక్కడ పనిచేసిన సదరు ఉద్యోగి ఆ కలెక్టర్ బదిలీ అయిన కొద్దిరోజులకే మళ్లీ కలెక్టరేట్‌కు డిప్యుటేషన్‌పై వచ్చారు. కలెక్టరేట్‌కు వచ్చిన ఈ ఉద్యోగి జిల్లాలోని మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలోని మండలాల్లో 22-ఎలో ఉన్న భూములకు షరతులు గల పట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో రైతుల పేరున పట్టాలు ఇచ్చే విషయంలో తనదైన శైలిలో వ్యవహరిస్తున్నాడనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఉద్యోగితో పాటు ఆయా డివిజన్ కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగులు ఎకరానికి ఇంతరేటని నిర్ణయించి వసూళ్లకు పాల్పడటం చర్చనీయాంశంగా మారింది.

22-ఎ భూములకు పట్టాలు ఇవ్వడంలోనూ..

అవనిగడ్డ, కోడూరు, గూడూరు, మచిలీపట్నం మండలాల్లో 22-ఎ భూములున్నాయి. వీటికి పట్టాలు మంజూరు చేసేందుకు పెద్దమొత్తంలో నగదును సదరు ఉద్యోగి వసూలు చేశాడని విశ్వసనీయ సమాచారం. బందరు మండలంలోని కోన, గరాలదిబ్బ, బందరు వెస్ట్ రెవెన్యూ గ్రామ పరిధిలో 22-ఎలో ఉన్న భూములు భీమవరం బడాబాబులు, పెద్ద రైతుల చేతుల్లో ఉన్నాయి. వీటికి పట్టాలు మంజూరు చేసేందుకు భారీగా నగదు వసూలు చేశాడని రెవెన్యూ విభాగంలో పనిచేసే ఉద్యోగులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు.

పోర్టు రోడ్డు కం రైలు మార్గాలకు భూములిచ్చిన రైతులతో బేరాలు

మచిలీపట్నం పోర్టు రోడ్డు కం రైలు మార్గాల కోసం రైతుల నుంచి ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసింది. ఈ భూముల్లో పూర్వార్జితపు ఆస్తులకు మిగతా 6లో..

మల్టీ మోడల్ మెట్రో స్టేషనే

పీఎన్‌బీఎస్ వద్ద ఏర్పాటుకు ప్రతిపాదనలు

- మెట్రో సహా సాధారణ రైళ్లు, బస్సుల కోసం ప్రత్యేకం
- అంతర్జాతీయ సంస్థతో డిజైన్ల రూపకల్పనకు యోచన
- కేసరపల్లిలో మెట్రో కోచ్ డిపో.. త్వరలో స్థలాన్వేషణ
- మెట్రో స్టేషన్లకు పాత ప్రాంతాల్లోనే భూ సేకరణ
- నిడమానూరు డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు అంచనాలు పూర్తి
- రూ.1,000 కోట్లతో ఆర్‌అండ్‌బీ-ఎన్‌హెచ్‌కు నివేదిక

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బెజవాడ మెట్రోరైల్ ప్రాజెక్టులో ప్రధానమైన మెట్రో స్టేషన్‌ను బహుళ రవాణా విధానం (మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్ట్)కు వీలుగా అభివృద్ధి చేయాలని మెట్రో అధికారులు నిర్ణయించారు. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉండేలా ఇంటర్నేషనల్ సంస్థకే దీని డిజైన్ బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నారు. పీఎన్‌బీఎస్ దగ్గర పెనమలూరు సెంటర్ నుంచి బందరు రోడ్డు మీదుగా వచ్చే కారిడార్-2తో పాటు గన్నవరం నుంచి ఎన్‌హెచ్-16 మీదుగా రామవరప్పాడు నుంచి ఏలూరు రోడ్డు మీదుగా రైల్వేస్టేషన్.. పీఎన్‌బీఎస్‌కు వచ్చే కారిడార్-1, అలాగే భవిష్యత్తులో పీఎన్‌బీఎస్ నుంచి అమరావతిలోని లింగాయపాలెం వరకు కారిడార్-3, జక్కంపూడి నుంచి పీఎన్‌బీఎస్ వరకు కారిడార్-4 కూడా పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ దగ్గరే అనుసంధానమవుతాయి. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని పీఎన్‌బీఎస్ దగ్గర మల్టీమోడల్ మెట్రో స్టేషన్‌ను నిర్మించాలని ఏపీఎంఆర్‌సీ అధికారులు భావిస్తున్నారు.

రూ.1,000 కోట్లతో నిడమానూరులో డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్

మెట్రో రైల్ కారిడార్-1లో అంతర్భాగంగా నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ రోడ్డు వరకు డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ కోసం రూ.1,000 కోట్లతో ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు అంచనాలు రూపొందించి ఆర్‌అండ్‌బీ (ఎన్‌హెచ్) విభాగానికి ప్రతిపాదనలు పంపారు. ఇది ప్రభుత్వం దృష్టికి వెళ్లాక అంతిమంగా జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) కు చేరుతుంది. నిడమానూరు జంక్షన్ నుంచి మహానాడు జంక్షన్ వరకు ఆరు వరసల 7 కిలోమీటర్ల మెగా ఫ్లై ఓవర్ మంజూరైన నేపథ్యంలో మెట్రో కారిడార్‌కు అడ్డుగా కాకూడదని నిర్ణయించారు. నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్‌రోడ్డు వరకు 4 కిలోమీటర్ల మేర డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మించాలని ర్ణయించారు.



పీఎన్‌బీఎస్ ప్రతిపాదిత మెట్రో రైల్వే స్టేషన్


మల్టీ మోడల్ అంటే..

మెట్రోస్టేషన్‌తో పాటు ఆర్టీసీ బస్సులు, సాధారణ రైళ్లకు కూడా ప్రయాణికులు చేరుకునేలా ప్లాన్ రూపొందించాలన్నది ఏపీఎంఆర్‌సీ అధికారుల ఆలోచన. పీఎన్‌బీఎస్ ఎదుట ఆర్టీసీకి చెందిన ఖాళీ స్థలంతో పాటు పక్కనే రైల్వేట్రాక్స్ అవతల రైల్వే స్థలం కూడా ఉంది. ఇవన్నీ ఉపయోగించుకుంటూ ఎలివేటెడ్ మల్టీమోడల్ మెట్రో స్టేషన్‌ను ఏర్పాటు చేయాలన్నది అధికారుల అభిప్రాయం. దీనివల్ల మెట్రో రైళ్లలో దిగినవారంతా నేరుగా పీఎన్‌బీఎస్‌లోకి, అలాగే రైల్వేస్టేషన్‌కు కూడా చేరుకునే అవకాశం ఉంటుంది. అలాగే, రైల్వే స్టేషన్, బస్టాండ్లకు వచ్చినవారు మిగతా 6లో..

మిస్టరీగా.. చల్లపల్లిలో భార్యాభర్తల మరణాలు



దారపురెడ్డి జమున(ఫైల్)



బండ్రెడ్డి సాంబ శివరావు(ఫైల్)

ఉరివేసుకుని భర్త సాంబశివరావు ఆత్మహత్య

- మంచంపై విగతజీవిగా భార్య జమున
- ఇరువురూ నాగాయలంక మండలం తలగడదీవి వాసులు

చల్లపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): భర్త ఉరివేసుకుని చనిపోగా, భార్య మంచంపై విగతజీవిగా పడి ఉన్న ఘటన చల్లపల్లిలో సోమవారం ఉదయం సంచలనం రేపింది. ఈ మరణాల వెనుక కారణాలు ఏమిటన్నది మిస్టరీగా మారింది. వివరాల్లోకి వెళితే... నాగాయలంక మండలం తలగడదీవి గ్రామానికి చెందిన దారపురెడ్డి జమున(39) గత కొన్నేళ్లుగా చల్లపల్లిలో నివసిస్తోంది. పదిహేనేళ్ల కిందటే భర్త చనిపోగా, అప్పటికే ఆమెకు ఆనంద్ అనే కుమారుడు ఉన్నాడు. భర్త చనిపోయిన తర్వాత వరుసకు మేనమామ అయ్యే తలగడదీవి గ్రామానికి చెందిన బండ్రెడ్డి సాంబశివరావు(45)ను రెండవ వివాహం చేసుకుంది. సాంబశివరావు సైతం భార్యకు విడాకులు ఇచ్చి ఉండటంతో జమునను వివాహం చేసుకున్నాడు. మొదటి సంబంధానికి ఓ కుమార్తె ఉండగా, పెళ్లికాని సోదరి, కుమార్తెతో కలిసి స్వగ్రామంలో ఉంటున్నాడు. సెంట్రింగ్ మేస్త్రీగా పనులు చేసే సాంబశివరావు తలగడదీవిలో నివసిస్తూ అప్పుడప్పుడూ చల్లపల్లి వచ్చి వెళుతుంటాడు. జమున మచిలీపట్నంలోని ఏఆర్‌టీ సెంటరులో కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగం చేస్తుండగా, కుమారుడు ఆనంద్ చల్లపల్లిలోని ఎరువుల దుకాణంలో పనిచేస్తున్నాడు.

గదిలో విగతజీవులుగా..

ప్రధాన రహదారి పక్కనే (షాబుల్ బజారు ఎదురుగా) బంగారు దుకాణాల వెనుక ఇంటిలో మిగతా 6లో..

ఇద్దరిదీ ఆత్మహత్యేనా!?

భార్యాభర్తల ఇద్దరూ ఆత్మహత్య చేసుకుని మరణించారా.. లేక భార్య జమున మరణం అనుమానాస్పదమా అన్నది తెలియాల్సి ఉంది. సాంబశివరావు ఉరి వేసుకుని చనిపోయి ఉండగా, జమున మాత్రం మంచంపై నిద్రిస్తున్నట్లుగానే చనిపోయి ఉంది. మెడపై చిన్నగాటు మినహా పెద్దగా చెప్పుకోదగ్గ గాయాలేమీ లేకపోవటం, గదిలో ఎటువంటి ఘర్షణ జరిగిన ఆనవాళ్లు లేకపోవడంతో భార్య మృతిపైనా బంధువులెవరూ అనుమానాలు వ్యక్తం చేయలేదు. నిద్రమాత్రలు తీసుకుని మరణించి ఉంటుందా అన్నది స్పష్టం కావాల్సి ఉంది. భార్యాభర్తల ఇరువురి నడుమా ఎలాంటి గొడవలూ లేవని మరణాలపై అనుమానాలేమీ లేవని మృతదేహాలను స్వగ్రామం తీసుకువెళ్లిపోతామంటూ తొలుత బంధువర్గం సిద్ధపడింది. పోలీసులు సైతం భార్య మృతిపై స్పష్టమైన అవగాహనకు రాలేకపోతున్నారు. శవపరీక్ష నివేదిక ఆధారంగానే ఓ నిర్ధారణకు వచ్చే అవకాశం ఉంది. డబ్బుల విషయమై ఇరువురి నడుమా ఏమైనా వివాదాలు ఉన్నాయా అన్న కోణంలోనూ పోలీసులు విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది. భార్యను హత్యచేసి భయపడి తానూ చనిపోవాలని నిర్ణయించుకుని ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చనే అనుమానాలు సైతం వ్యక్తమవుతున్నాయి. శవపరీక్ష నివేదిక తర్వాతే జమున మృతి ఆత్మహత్యా, హత్యా అన్నది స్పష్టమయ్యే అవకాశం ఉంది.

యథేచ్ఛగా ఎన్టీఆర్ స్టేడియం కమిటీ అక్రమాలు
● మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో అనుమతులు లేకుండా నిర్మాణాలు
8లో

11 నుంచి తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ల
8లో

ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా నోడల్ అధికారిగా కన్నమనాయుడు
6లో

మూడున్నరేళ్ల బాలుడి ఉసురుతీసిన మైనర్

బైక్‌పై ఇద్దరిని ఎక్కించుకుని వేగంగా వచ్చి బాలుడిని ఢీకొట్టాడు..



నిమ్మగడ్డ గగన్ సాయి మృతదేహం

- తలకు బలమైన గాయాలు కావడంతో బాలుడు అక్కడికక్కడే మృతి
- 2023లోనూ ఒకరి మృతికి కారణమైన సదరు మైనర్

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఇద్దరిని ఎక్కించుకుని అతి వేగంగా బైక్‌ను నడిపిన మైనర్ మూడున్నరేళ్ల బాలుడి ఉసురు తీసిన ఘటన తోట్లవల్లూరు మండలం బొడ్డపాడులో ఆదివారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే... బొడ్డపాడు గ్రామానికి చెందిన నిమ్మగడ్డ కిషోర్ దంపతులకు ఒక కుమార్తె, ఒక కుమారుడు నిమ్మగడ్డ గగన్ సాయి. వ్యవసాయం చేసుకుంటూ జీవించే కిషోర్ తన మూడున్నరేళ్ల కుమారుడిని అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. గగన్ సాయి బొడ్డపాడులో ఆదివారం సాయంత్రం ఇంటి నుంచి పెదనాన్న ఇంటికెళ్లేందుకు రోడ్డు దాటుతున్నాడు. అంతలోనే వల్లూరుపాలేనికి చెందిన మైనర్ బాలుడు మరో ఇద్దరిని బైక్‌పై ఎక్కించుకుని అతివేగంగా వచ్చి గగన్ సాయిని ఢీకొట్టాడు. తలకు బలమైన గాయాలు కావడంతో వెంటనే గగన్‌సాయిని విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి డాక్టర్లు పరీక్షించి బాలుడు మృతి చెందినట్లు నిర్ధారించడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

గతంలోనూ ఒకరి చావుకు కారణం.. రూ.3 లక్షలతో రాజీ

గగన్ సాయిని బైక్‌తో ఢీకొట్టిన మైనర్ బాలుడు చాలా కాలంగా బైక్ ర్యాష్‌గా నడుపుతున్నట్టు పలువురు చెబుతున్నారు. 2023లో పంతగాని బేబీరాజు అనే ట్రాక్టర్ డ్రైవర్‌ని ఢీకొట్టగా అతను చనిపోయాడు. నాడు కేసు నమోదైనా మిగతా 6లో..

మడ అడవుల అభివృద్ధికి రూ.4.70 కోట్లు

- కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ వెల్లడి
- పార్లమెంట్‌లో విజయవాడ, కర్నూలు ఎంపీలు కేశినేని, బస్తిపాటి ప్రశ్నకు సమాధానంగా..

మచిలీపట్నం, ఫిబ్రవరి3(ఆంధ్రజ్యోతి): మడ అడవుల అభివృద్ధి కోసం ఆంధ్రప్రదేశ్‌కు రూ.4.70 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుశాఖ సహాయమంత్రి కీర్తివర్ధన్‌సింగ్ తెలిపారు. శుక్రవారం జరిగిన పార్లమెంటు సమావేశంలో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు రాష్ట్రంలో మడ అడవుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై వివరాలు తెలియజేయాలని కోరారు. దీనిపై స్పందించిన కేంద్ర సహాయ మంత్రి సమాధానమిస్తూ మంగ్రూవ్ ఇనిషియేటివ్ ఫర్ షోర్‌లైన్ హాబిటేట్స్ అండ్ టాంగిబుల్ ఇన్‌కమ్స్(మిష్టి) కార్యక్రమం ద్వారా ఏపీలో 701 హెక్టార్లలో మడ అడవులను అభివృద్ధి చేసేందుకు రూ.4.70 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నిధులతో కొత్త ప్రాంతాల్లో మడ అడవులను పెంచేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు.

నందిగామ చైర్‌పర్సన్ ఎన్నికపై హైకోర్టు తీర్పు రిజర్వ్

అమరావతి, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): నందిగామ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నిక కోసం సమావేశం నిర్వహణను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యంపై సోమవారం హైకోర్టులో వాదనలు ముగిశాయి. న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. నందిగామ మున్సిపాలిటీ పరిధిలో ఖాళీ అయిన రెండు వార్డు కౌన్సిలర్ల స్థానాలకు ఉపఎన్నికలు జరిపాకే చైర్‌పర్సన్ ఎన్నికను నిర్వహించేలా అధికారులను ఆదేశించాలని నందిగామకు చెందిన నాదెండ్ల హారిక హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు వచ్చింది. ఖాళీగా ఉన్న కౌన్సిలర్ల స్థానాలకు ఎన్నికలు జరపకుండా చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహిస్తే ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు ఆ పదవిని పొందే అవకాశం కోల్పోతారని పిటిషనర్ తరఫున న్యాయవాది వాదనలు వినిపించారు. చైర్‌పర్సన్ ఎన్నిక కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను పిటిషనర్ సవాల్ చేయలేదని, కోరం ఉన్నప్పుడు చైర్‌పర్సన్ ఎన్నికను జరుపుకోవచ్చని, అందుకు సంబంధించిన చట్టనిబంధనలును ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్.ప్రణతి, నందిగామ మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్ శిరీష కోర్టు ముందుంచారు. వార్డు కౌన్సిలర్ల స్థానాలు ఖాళీగా ఉన్నప్పటికీ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహణకు చట్టనిబంధనల్లో ఎలాంటి అడ్డంకి లేదన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు.

ఎన్నికల నియమావళి కృష్ణాజిల్లా నోడల్ అధికారిగా

జడ్పీ సీఈవో కన్నమనాయుడు

మచిలీపట్నం, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): శాసనమండలి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికల సందర్భంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కృష్ణాజిల్లాలో పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు కలెక్టర్ బాలాజీ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లానోడల్ అధికారిగా జడ్పీ సీఈవో సీహెచ్ కన్నమనాయుడును నియమించినట్లు అందులో పేర్కొన్నారు. మండల స్థాయిలో ఎంపీడీవోలు, మునిసిపల్ కార్పొరేషన్, పురపాలకసంఘాల్లో కమిషనర్లు ఎన్నికల నియమావళిని అమలు చేసేందుకు పర్యవేక్షణా అధికారులుగా ఉంటారన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించినట్టు ఫిర్యాదులు వస్తే, వెంటనే చర్యలు తీసుకోవాలని, పూర్తిస్థాయి సమాచారాన్ని తనకు, జేసీకి వెంటనే తెలియజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఆధార్‌కార్డుల బయోమెట్రిక్ తప్పనిసరి

అప్పుడే పుట్టిన శిశువులనుంచి ఐదేళ్లలోపు, ఐదు నుంచి ఏడేళ్ల లోపు బాలలకు, 15 నుంచి 17 ఏళ్ల వారికి ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయాలని అధికారులను కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. జిల్లాస్థాయి ఆధార్ పర్యవేక్షణ కమిటీ సమావేశం కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించారు. జిల్లాలో ఆధార్‌నమోదు కేంద్రాల పనితీరు, నమోదు వివరాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అప్పుడే పుట్టిన శిశువుల నుంచి ఐదేళ్ల బాలల వరకు ఆధార్‌కార్డులు ఇవ్వడంపై అధికారులు దృష్టి సారించాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఐదేళ్లలోపు 38వేలమంది బాలలకు ఆధార్‌కార్డుల మంజూరు పెండింగ్‌లో ఉందన్నారు. 5 నుంచి 17 ఏళ్లలోపు వారినుంచి బయోమెట్రిక్‌ను తీసుకుని ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డలకు ఆస్పత్రుల్లో ఆధార్ నమోదు చేయాలన్నారు. 5 నుంచి 17 ఏళ్లలోపు బాలలకు, యువతకు పాఠశాలలు, కళాశాలల్లో, గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆధార్‌కార్డులను అప్‌డేట్ చేయించుకోవడంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఆధార్‌మానిటరింగ్ కమిటీ కన్వీనర్ శ్రీదేవి, యూఐడీఏఐ అసిస్టెంట్ మేనేజర్ గిరిధర్, ఎల్‌డీఎం రవీంద్రరెడ్డి, సీడీపీవో కె.గ్లోరీ, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

భూమి విలువ పెంపు ప్రభావం

రిజిస్ట్రేషన్లపై ఉండదు

- ఎన్టీఆర్ జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గాప్రసాద్


జగ్గయ్యపేటలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): భూమి విలువల పెంపు ప్రభావం ఎన్టీఆర్ జిల్లాలో రిజిస్ట్రేషన్లపై ఉండదని జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గాప్రసాద్ తెలిపారు. సోమవారం జగ్గయ్యపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో 70 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని తెలిపారు. గత ఏడాది విజయవాడ, జగ్గయ్యపేట ప్రాంతాల్లో వరదల ప్రభావం వల్ల తగ్గాయని చెప్పారు. జగ్గయ్యపేట, విస్సన్నపేటల్లో 17 శాతం రిజిస్ట్రేషన్ల ఆదాయం తగ్గిందన్నారు. ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు జరగటం లేదన్నారు. భూమి విలువ పెంపుపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి కలెక్టర్‌కు తెలిపామని, జగ్గయ్యపేటలో 3 అభ్యంతరాలను పరిష్కరించామని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు నూతన భవనాలను నిర్మించే ఆలోచన లేదని, ఆధునీకరణకు ప్రతిపాదనలు కోరామన్నారు. జగ్గయ్యపేట ప్రాంతంలో రీసర్వే కారణంగా నిలిచిపోయిన మల్కాపురం, ముచ్చింతాల గ్రామాల రికార్డులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ల ద్వారా కలెక్టర్‌ను కోరామన్నారు. జగ్గయ్యపేటతో సహ జిల్లాలో అన్ని ప్రాంతాల్లో నామమాత్రంగానే 10-15 శాతం విలువల పెంచామని తెలిపారు. కార్యాలయ రికార్డులు సబ్‌రిజిస్ట్రార్ మనోహర్‌నాయక్ చూపించారు.

ఏడీజేగా బాబు నాయక్‌కు పదోన్నతి


సీనియర్ సివిల్ జడ్జి బాబు నాయక్‌ను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

అవనిగడ్డ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న బి.బాబు నాయక్‌కు ఏడీజే(అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి)గా పదోన్నతి లభించింది. పది నెలలుగా అవనిగడ్డ కోర్టులో సీనియర్ సివిల్ జడ్జిగా ఆయన పని చేస్తున్నారు. బాబునాయక్ ఏడీజేగా పదోన్నతి పొంది చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. బాబు నాయక్ దంపతులను అవనిగడ్డ బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం కోర్టు ఆవరణలో సత్కరించారు. బెంచ్, బార్‌ల సమన్వయంతో అవనిగడ్డలో ఎన్నో కేసులు పరిష్కరించగలిగామని అన్నారు. అవనిగడ్డ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సనకా రఘురామప్రసాద్, న్యాయవాది కర్రా సుధాకర్, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పులిగడ్డ వేంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

- వెండి ఆభరణాలు ఎత్తుకుపోయిన దుండగులు

అవనిగడ్డ, ఫిబ్రవరి 3(ఆంధ్రజ్యోతి): పులిగడ్డ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఆలయ అర్చకుడు అగ్నిహోత్రం ధన్వంతరాచారి తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోగా, అర్ధరాత్రి తర్వాత ఆలయ ఆవరణలోకి చొరబడిన దొంగలు ప్రధాన ద్వారం తలుపులు పగులకొట్టి లోపల ఉన్న స్వామి వెండి మకరతోరణం, వెండి కిరీటం, ఇతర ఆభరణాలు ఎత్తుకుపోయారు. సోమవారం ఉదయం అర్చకుడు ధన్వంతరాచారి ఆలయం వద్దకు వెళ్లగా, ఆలయ ప్రధాన ద్వారం తాళాలు పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ నేతృత్వంలో సీఐ యువకుమార్, ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. సీసీ టీవీ పుటేజీ ఆధారంగా దర్యాప్తును ప్రారంభించారు. ఇద్దరు యువకులు ముఖానికి మాస్క్, తలపై వస్త్రాలను ధరించి ఆలయంలోకి చొరబడటం సీసీ టీవీలో రికార్డయింది. దొంగతనం జరిగిన సమయానికి రెండు గంటల ముందు ఆ ప్రాంతంలో ఓ కారు అనుమానాస్పదంగా తిరిగినట్టు రికార్డయింది. కారు ఆధారంగా దొంగల ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు ప్రయత్నాలు ప్రారంభించారు. మచిలీపట్నం సీసీఎస్ స్టేషన్ నుంచి రత్తయ్య, క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది దర్యాప్తులో పాలుపంచుకున్నారు.


నిలిచిన వేదాద్రి ఎత్తిపోతల పథకం పనులు, వైసీపీ ప్రభుత్వ హయాంలో వేసిన శంకుస్థాపన శిలాఫలకం

వేలాది ఎకరాలకు సాగునీరు, పదుల సంఖ్యలో గ్రామాలకు తాగునీరు ఇవ్వడం ఆ పథకం లక్ష్యం. 2019లో ప్రభుత్వం మారడంతో లక్ష్యం ముక్కలైపోయింది. అనుకున్న లక్ష్యానికి అడుగు ముందుకు పడలేదు. ఆశయం ఎప్పుడు నెరవేరుతుందో తెలియని పరిస్థితి. ఆ పథకం పరిధిలో ఉండే ప్రజల ఆశలు మాత్రం అలాగే సజీవంగా ఉన్నాయి. ఇదీ జగ్గయ్యపేట నియోజకవర్గంలోని వేదాద్రి ఎత్తిపోతల పథకం పరిస్థితి.

ఎప్పటికి పూర్తయ్యేనో..

వేదాద్రి కోసం రైతన్నల ఎదురుచూపులు

- పథకాన్ని నిర్వీర్యం చేసిన 'వైసీపీ'
- 'కూటమి'పై ప్రజల ఆశలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఎన్టీఆర్ జిల్లాకు చిట్టచివర నియోజకవర్గంగా ఉన్న జగ్గయ్యపేట పరిధిలో వేదాద్రి ఎత్తిపోతల పథకం నిర్మాణానికి టీడీపీ శ్రీకారం చుట్టింది. జగ్గయ్యపేట మండలంలోని ముక్త్యాల వద్ద ముక్త్యాల ఎత్తిపోతల పథకం పేరుతో అప్పటి సీఎం చంద్రబాబు 2019 ఫిబ్రవరి 16న శంకుస్థాపన చేశారు. రూ.489 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టారు. పనులు ప్రారంభమయ్యే సమయానికి 2019 ఎన్నికల కోడ్ రావడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ సాగునీటి ప్రాజెక్టుల్లో భారీగా అక్రమాలు జరిగాయని పనులను 15 నెలలపాటు నిలిపివేసింది. రివర్స్ టెండరింగ్ పేరుతో హడావిడి చేసింది. ముక్త్యాల వద్ద నిర్మించాల్సిన ఈ పథకాన్ని సుమారు ఎనిమిది కిలోమీటర్లకు దిగువన ఉన్న వేదాద్రికి మార్చింది. ముక్త్యాల ఎత్తిపోతల పథకం పేరును వైఎస్సార్ వేదాద్రి ఎత్తిపోతల పథకంగా మార్పు చేసింది. రివర్స్ టెండరింగ్‌తో ఈ ప్రాజెక్టు వ్యయాన్ని రూ.489 కోట్ల నుంచి రూ.369 కోట్లకు తగ్గించామని గొప్పలు చెప్పుకొంది. శంకుస్థాపన సమయానికి ప్రాజెక్టు వ్యయాన్ని రూ.489 కోట్లుగానే చూపించి నాటి సీఎం జగన్ శిలాఫలకాన్ని వర్చువల్ విధానంలో ఆవిష్కరించారు. టీడీపీ హయాంలో ఎవరైతే ముక్త్యాల ప్రాజెక్టును చేపట్టారో అదే కాంట్రాక్టరుకు వైఎస్సార్ వేదాద్రి ఎత్తిపోతల పనులను అప్పగించారు.

'రివర్స్' లిఫ్ట్

వేదాద్రి ఎత్తిపోతల పూర్తయితే జగ్గయ్యపేట నియోజకవర్గ పరిధిలోని జగ్గయ్యపేట మండలంలోని ఎనిమిది గ్రామాలు, వత్సవాయి మండలంలోని పది, పెనుగంచిప్రోలు మండలంలోని పది గ్రామాల్లో సుమారుగా 39వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. దీనితోపాటు డీవీఆర్(దేవినేని వెంకటరమణ) బ్రాంచి కాల్వ పరిధిలోని 30 గ్రామాలకు వాటితోపాటు జగ్గయ్యపేట మున్సిపాలిటీకి ఈ ఎత్తిపోతల ద్వారా తాగునీరు అందాల్సి ఉంది. సుమారు 2.7 టీఎంసీల నీటిని సాగు, తాగునీటి అవసరాలకు ఈ ఎత్తిపోతల ద్వారా అందించాల్సి ఉంది.

తిరోగమన దిశగా వైసీపీ ఆలోచనలు

ప్రతి ప్రాజెక్టుకు, ఎత్తిపోతల పథకానికి ఇంజనీరింగ్ ప్రణాళిక ఉంటుంది. ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతానికి నీటిని ఎత్తిపోయడం సులభమైన విధానం. ఇంజనీరింగ్‌లో అనుభవం లేని వాళ్లూ ఇదే విషయాన్ని చెప్పారు. నాడు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రివర్స్ మాయలో ఉన్న వైసీపీ చివరికి ఎత్తిపోతల పథకం నిర్మాణంలోనూ తిరోగమన దిశగానే ఆలోచించింది. టీడీపీ ప్రభుత్వం ఎంపిక చేసిన ప్రదేశాన్ని రద్దు చేసి అక్కడి నుంచి నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతానికి పథకాన్ని మార్పు చేసింది. ముక్త్యాలలో కృష్ణానదిలో నీటిలభ్యత ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ నదిలో లోతు బాగా ఉంటుంది. ముక్త్యాల నుంచి గండ్రాయి వరకు పైపులైన్ నిర్మించి, అక్కడున్న చెరువులోకి నీటిని పంపాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది. దీని నుంచి డీవీఆర్ బ్రాంచ్ కెనాల్ (16వ నంబరు బ్రాంచ్ కెనాల్)లోకి నీటిని ఎత్తిపోస్తారు. దీనివల్ల 30 గ్రామాలకు అత్యంత సులువుగా నీరు అందుతుంది. జగ్గయ్యపేట, షేర్‌మహ్మద్‌పేటలో ఉన్న ఊర చెరువులు, అనుమంచిపల్లిలో గల గిన్నె చెరువులకు పుష్కలంగా నీరు అందడంతో పంట పొలాలకు సాగునీరు అందుతుంది. ఈ కోణంలో ఆలోచించి నాటి టీడీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ముక్త్యాలను ఎంపిక చేసింది. ఇక్కడ నిర్మాణం చేపట్టడానికి అంగీకరించని వైసీపీ ప్రభుత్వం పథకం పేరును వైఎస్సార్‌గా ఎత్తిపోతలుగా మార్చింది. ఈ ప్రదేశాన్ని కాదని పథక నిర్మాణాన్ని వేదాద్రికి మార్పు చేసింది. దీనివల్ల వేదాద్రికి ఎగువన ఉన్న 10-15 గ్రామాల్లోని పంటలకు సాగునీరు అందే పరిస్థితి ఉండదు. జగ్గయ్యపేట, షేర్‌మహ్మద్‌పేటలోని ఊర చెరువులు, అనుమంచిపల్లిలోని గిన్నె చెరువులకు తెలంగాణలోని కానవరం ఛానల్ నుంచి, చెరువు మాధవరంలోని సీఎం ట్యాంక్ నుంచి నీరు అందుతోంది. ఈ నీరు సక్రమంగా అందకపోవడంతో రైతాంగం ఇబ్బందులు పడుతోంది. వేదాద్రి నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం గండ్రాయికి పది కిలోమీటర్లకు దిగువన ఉంది. ప్రస్తుతం వేదాద్రిలో పైపులైన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ పైపులైన్ వత్సవాయి మండలం భీమవరం వద్ద డీవీఆర్ బ్రాంచ్ కెనాల్‌లో కలుస్తుంది. అక్కడ మళ్లీ లిఫ్ట్‌ను పెట్టి ఎగువ భూభాగంలో ఉన్న చెరువులను నింపడానికి నీటిని ఎత్తిపోయాల్సి ఉంటుంది.

కంచెలను నిర్వీర్యం చేసిన వైసీపీ ప్రభుత్వం

వేదాద్రి వద్ద నిర్మించే ఎత్తిపోతల పథకానికి ముందు దేవినేని వెంకటరమణ హయాంలో వేదాద్రి కంచెల ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఉన్న వేదాద్రికి మూడు, నాలుగు కిలోమీటర్ల దిగువన ఉంటుంది. నదికి చెంతనే నిర్మించినప్పటికీ దీన్ని వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. నిర్వాహణ లేకపోవడంతో మోటార్లు చెడిపోయాయి. ఫలితంగా ఈ పథకం తలుపులు వేసుకుంది. వైసీపీ ప్రభుత్వం 2024 నాటికి వేదాద్రి ఎత్తిపోతల పథకాన్ని అందుబాటులోకి తెస్తామని ప్రకటించింది. ఆ మేరకు పనులు మాత్రం చేయించలేకపోయింది. కూటమి ప్రభుత్వం అయినా ఈ పథకాన్ని సకాలంలో పూర్తి చేయాలని స్థానిక రైతాంగం కోరుతోంది.

కూటమి అధికారంలోకి వచ్చినా

న్యాయం జరగలేదు

కొందరు అధికారులు ఇప్పటికీ వైసీపీ తొత్తులే



- నేటి నుంచి ఎంపీడీవో కార్యాలయంలో నిరాహారదీక్ష చేస్తా
- తమిరిశ సర్పంచ్‌గా పోటీచేసిన టీడీపీ మద్దతుదారు కారే వెంకటరమణమ్మ
- తనపై పోటీచేసిన వైసీపీ మద్దతుదారు తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించారని ఆరోపణ

ఆంధ్రజ్యోతి - గుడివాడ: తనపై వైసీపీ మద్దతుతో పోటీచేసి, గెలుపొందిన నందివాడ మండలం తమిరిశ సర్పంచ్ తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించారని తగిన పత్రాలతో తాను నాలుగేళ్లుగా పోరాడుతున్నానని, కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా తనకు న్యాయం జరగడం లేదని, అధికారులు నేటికీ వైసీపీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని టీడీపీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీచేసిన కారే వెంకటరమణమ్మ ఆరోపించారు. అధికారులు తీరుకు నిరసిస్తూ ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం నుంచి నిరాహార దీక్షకు దిగుతున్నట్లు ఆమె ప్రకటించారు. 2021లో తమిరిశ సర్పంచ్ అభ్యర్థులుగా టీడీపీ మద్దతుతో కారే వెంకటరమణమ్మ, వైసీపీ మద్దతుతో తప్పిట ధనలక్ష్మి పోటీచేశారు. ధనలక్ష్మి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాన్ని నామినేషన్‌లో సమర్పించారు. ఆమె ఎస్సీ కాదని, బీసీ(సీ) అని ఎన్నికల అధికారికి రమణమ్మ ఫిర్యాదు చేశారు. బీసీ(సీ)అని నిర్ధారించే విద్యాభ్యాస పత్రాలను సమర్పించారు. ఎన్నికల అధికారి రమణమ్మ ఫిర్యాదును తోసిపుచ్చారు. అప్పటి వైసీపీ నాయకుల ఒత్తిడితోనే ఇది జరిగిందని, దీనిపై పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారులను కలిసి న్యాయం చేయాలని కోరానని స్పందన లేకపోవడంతో కోర్టును ఆశ్రయించానని రమణమ్మ తెలిపారు.

స్టడీ సర్టిఫికెట్లలో బీసీ(సీ)


పాఠశాల టీసీలో బీసీ(సీ)గా నమోదు


రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఎస్సీ సర్టిఫికెట్

'ధనలక్ష్మి తమిరిశ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి వరకు చదివారు. రికార్డుల్లో గంటా ధనలక్ష్మి, క్రిస్టియన్ మాల బీసీ(సీ) అని ఉంది. వివాహానంతరం ఆమె ఇంటి పేరు తప్పిటకు మారింది. బీసీ(సీ) అని రుజువులిచ్చినా, అప్పటి ఎంపీడీవో కార్యాలయ, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదు. పాఠశాల సర్టిఫికెట్‌లో ఎస్సీకి బదులు బీసీ(సీ)గా నమోదైనట్లు కోర్టును తప్పుదోవ పట్టించారు. టీసీ పరిశీలించకుండా వైసీపీ నేతలు చెప్పినట్టు అధికారులు ఎస్సీ సర్టిఫికెట్ ఇచ్చారు.'అని రమణమ్మ ఆరోపించారు.

సీఎం, మంత్రులను కలిసినా ప్రయోజనం శూన్యం

'కూటమి అధికారంలోకొచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, వాసంశెట్టి సుభాష్, డోలా వీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, వంగలపూడి అనిత దృష్టికి సమస్యను తీసుకెళ్లా. పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజను కలిస్తే చర్యలు తీసుకోమని జిల్లా సీఈవోకు ఆదేశాలిచ్చారు. గత ఏడాది నవంబరు 29న ఎంపీడీవో మల్లీశ్వరి, ఈవోపీఆర్డీ అబ్దుల్‌బాషా తదితర బృందం తమిరిశ పంచాయతీ కార్యాలయంలో విచారణ చేసింది. మూడునెలలవుతున్నా నేటికీ జిల్లా సీఈవోకు నివేదిక సమర్పించలేదు.' అని రమణమ్మ ఆరోపిస్తున్నారు.

మిస్టరీగా..చల్లపల్లిలో భార్యాభర్తల మరణాలు

(5వ పేజీ తరువాయి)

జమున అద్దెకు ఉంటుంది. ఎప్పటిలాగానే ఆదివారం సాయంత్రం సాంబశివరావు చల్లపల్లి వచ్చాడు. కుమారుడు ఆనంద్ స్థానిక నారాయణరావు నగర్ కాలనీలో ప్రతిష్ఠామహోత్సవాలు ఉండటంతో ఆ పనుల్లో ఉండి ఆదివారం రాత్రి ఇంటికి వచ్చి మళ్లీ వెళ్లిపోయాడు. ఇంటి గదిలో భార్యాభర్తలు ఇద్దరూ మృతి చెంది ఉండటాన్ని డాబాపై అద్దెకుండే వారు గమనించారు. సెల్‌ఫోన్ చార్జర్ తీసుకుని ఇవ్వకపోవడంతో చార్జర్ కోసం ఉదయం ఇంటి తలుపుకొట్టగా, ఎంతకీ తలుపు తీయకపోవటంతో కిటికీలో నుంచీ లోపలకు చూడటంతో మంచంపై ఒకరు, ఉరివేసుకుని ఒకరు ఉండటాన్ని చూసి ఇరుగుపొరుగు వారితో కలిసి తలుపు బలవంతంగా తోసి లోపలకు వెళ్లిచూశారు. భార్యాభర్తలు ఇద్దరూ అప్పటికే మృతి చెంది ఉండటంతో కొడుకు ఆనంద్, పోలీసులకు సమాచారం అందించారు.

గత నెలలో 2వ తేదీనే వచ్చాడు..

గత నెలలో రెండవ తేదీన వచ్చిన సాంబశివరావు ఈ నెలలోనూ రెండవ తేదీ ఆదివారమే చల్లపల్లి వచ్చినట్లు తెలుస్తోంది. జీతం డబ్బులేమైనా తీసుకువెళ్లేందుకు వచ్చాడా, ఆ విషయమై ఇరువురి నడుమా గొడవలు జరుగుతున్నాయా అన్నది తెలియాల్సి ఉంది. జమున మృతికి స్పష్టమైన కారణాలు తెలిస్తేనే మరణాల మిస్టరీ వీడే సూచనలు కనిపిస్తున్నాయి. ఘటనా స్థలానికి వచ్చిన అవనిగడ్డ డీఎస్పీ టి.విద్యశ్రీ మృతదేహాలను పరిశీలించి వివరాలు సేకరించారు. మచిలీపట్నం నుంచి క్లూస్ టీమ్ ఆధారాల కోసం అన్వేషించారు. చల్లపల్లి ఎస్ఐ పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మల్టీ మోడల్ మెట్రో స్టేషన్

(5వ పేజీ తరువాయి)

కూడా మెట్రో రైళ్లలో ప్రయాణించవచ్చు. ఇప్పటికే ఈ మల్టీమోడల్ స్టేషన్‌కు సంబంధించి విధాన నిర్ణయం తీసుకున్నారు. త్వరలోనే దీనికి సంబంధించి డిజైన్లకు శ్రీకారం చుడతారు.

కేసరపల్లిలో మెట్రో కోచ్ డిపో ఏర్పాటు


మెట్రో రైళ్ల కోచ్ డిపోను కేసరపల్లిలో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతంలో కోచ్ డిపోను నిడమానూరులో ఏర్పాటు చేయాలనుకున్నారు. కారిడార్-1 అనేది గన్నవరం నుంచి వస్తుంది కాబట్టి.. కోచ్ డిపోను కూడా దీనికి దగ్గరగా ఉన్న కేసరపల్లిలో ఏర్పాటు చేయాలన్నది మెట్రో అధికారుల ఆలోచన. ఇందుకోసం కేసరపల్లిలో 40 ఎకరాల మేర సేకరించనున్నట్టు తెలుస్తోంది. కేసరపల్లి కోచ్ డిపో నుంచి మెట్రో రైళ్లు గన్నవరం వెళ్లి, అక్కడి నుంచి తిరిగి విజయవాడ వస్తాయి.

మెట్రో పాత ప్రతిపాదిత స్టేషన్లలోనే భూ సేకరణ

విజయవాడలో మెట్రోరైల్ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లడం కోసం మొత్తం 100 ఎకరాలు అవసరమని ఉమ్మడి కృష్ణా యంత్రాంగాలకు నివేదిక అందింది. దీనికి సంబంధించి ప్రభుత్వానికి కూడా ప్రతిపాదన వెళ్లింది. భూ సేకరణకు అనుమతులు కూడా వచ్చాయి. గతంలో ప్రతిపాదించిన అలైన్‌మెంట్ ప్రకార మే నిర్ణయించిన స్టేషన్ల దగ్గర భూములను సేకరిస్తారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం భూ సేకరణ జరుపుతారా? లేదా?, పరిహారం వంటి అంశాలపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు.

నందిగామలో రగడ

మునిసిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక నేటికి వాయిదా


ప్రభుత్వ పెద్దలతో ఫోన్‌లో మాట్లాడుతున్న కనపర్తి శ్రీనివాసరావు

నందిగామ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నందిగామ మునిసిపాలిటీ చైర్‌పర్సన్ ఎన్నిక అనేక రాజకీయ పరిణామాల నడుమ మంగళవారానికి వాయిదా పడింది. సోమవారం ఉదయం 10 గంటలకు చైర్‌పర్సన్ ఎన్నిక జరగాల్సి ఉంది. టీడీపీకి చెందిన ఐదుగురు సభ్యులతో పాటు జనసేనకు చెందిన ఒకరు, వైసీపీ నుంచి వలస వచ్చిన 7 మంది.. ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య నివాసానికి చేరుకున్నారు. ఈ సమావేశంలో అభ్యర్థి ఎవరన్నది ప్రకటించేందుకు ఆమె సిద్ధమవుతుండగా, అదే సందర్భంలో అక్కడికి చేరుకున్న టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు.. జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ నుంచి వచ్చిన బీఫాంను అందజేశారు. 8వ వార్డు సభ్యురాలు శాఖమూరి స్వర్ణలత పేరు అందులో రాసి ఉండటంతో ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఆగ్రహంతో ఊగిపోయారు. తన నియోజకవర్గంలో జరిగే ఎన్నికకు సంబంధించి బీఫాంపై పేరు రాసేటప్పుడు తనను సంప్రదించే అవసరం లేదా అని కనపర్తిని ప్రశ్నించారు. ఇది రాష్ట్ర పార్టీ ఆదేశమని ఆయన బదులిచ్చారు. కనపర్తితో సౌమ్య వాగ్వాదానికి దిగారు. ఇదేనా తనకిచ్చే గౌరవమని మండిపడ్డారు. బీఫాంపై ఎవరి పేరున్నా తాను లెక్కచేయనని, తాను సూచించిన వారికే పదవి వరిస్తుందని స్పష్టం చేశారు.

పట్టువీడని ఎమ్మెల్యే సౌమ్య

తన నిర్ణయమే ఫైనల్ అని భీష్మించిన ఎమ్మెల్యే సౌమ్యను ఒప్పించేందుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు రంగంలోకి దిగారు. సౌమ్యకు ఫోన్ చేశారు. ఆయన ఫోన్ రిసీవ్ చేసుకోకపోవడంతో కనపర్తికి ఫోన్‌చేసి సౌమ్యకు ఇమ్మన్నారు. ఎమ్మెల్యేగా తనతో సంప్రదింపులు లేకుండా, కనీసం పరిగణనలోకి కూడా తీసుకోకుండా ఇతరులు ప్రతిపాదించిన స్వర్ణలతకు తాను పదవి ఇచ్చేది లేదని, కౌన్సిలర్లు కూడా ఆమెకు సహకరించబోరని స్పష్టం చేశారు. కౌన్సిలర్ల అభిప్రాయాలను ధిక్కరించి ఆమెను ఎందుకు చైర్‌పర్సన్ చేయాలని ప్రశ్నించినట్లు తెలిసింది. అది పార్టీ నిర్ణయమని చెప్పినా సౌమ్య వినిపించుకోలేదు. దీంతో మంత్రి లోకేశ్ వ్యక్తిగత కార్యదర్శి కిలారు రాజేశ్ కూడా ఈ అంశంపై కనపర్తి శ్రీనివాసరావు, నెట్టెం రఘురామ్‌కు ఫోన్ చేసినట్లు సమాచారం. కాగా, టీడీపీ, జనసేన కౌన్సిలర్లతో పాటు వైసీపీ నుంచి టీడీపీలోకి వచ్చిన కౌన్సిలర్లు కూడా ఎమ్మెల్యే సౌమ్య నిర్ణయమే తమకు శిరోధార్యమన్నారు. తనకు ఖాళీ బీఫాం తెచ్చి ఇవ్వాలని, అంతవరకు ఎన్నికకు వెళ్లేది లేదని సౌమ్య తేల్చారు. కౌన్సిలర్లు ఎవరూ బయటకు రాలేదు. ఈ వివాదంతో పట్టణంలోని ప్రజలతో పాటు నాయకులు పెద్ద ఎత్తున సౌమ్య నివాసానికి వచ్చారు. పట్టు వీడని సౌమ్య కౌన్సిలర్ల.. ఓటింగ్‌కు వెళ్లకుండా నిలువరించారు. దీంతో ఎన్నిక వాయిదా పడింది. కాగా, సోమవారం రాత్రి 9 గంటల సమయంలో మంత్రి నారాయణ.. సౌమ్యకు ఫోన్‌చేయడంతో పరిస్థితి సద్దుమణిగింది. చైర్‌పర్సన్ ఎన్నిక సౌమ్య నిర్ణయానికే వదిలేయడంతో మంగళవారం నాటి ఎన్నిక లాంఛనం కానుంది. దీంతో కౌన్సిలర్లను నందిగామలోని ఓ హోటల్‌లో ఉంచారు. అక్కడి నుంచి ఎన్నికల ప్రాంగణానికి తీసుకెళ్తారు.

ఆధిపత్య పోరే కారణమా?

ఎంపీ కేశినేని చిన్ని, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మధ్య కొద్దికాలంగా ఆధిపత్య పోరు నడుస్తోంది. అధికారం చేపట్టిన అనతికాలంలోనే ఇద్దరి మధ్య తేడాలు వచ్చినట్టు ప్రచారం జరిగింది. ఇటీవల జరుగుతున్న పరిణామాలు కూడా వీటిని నిజం చేశాయి. నియోజకవర్గంలోని కొందరు నాయకులు పదవుల కోసం ఎంపీ మద్దతు కోరారు. వారికి ఆయన అండగా నిలుస్తున్నారు. ఈ పరిణామాలను సౌమ్య జీర్ణించుకోలేకపోతున్నారని ఆమె మద్దతుదారులు చెబుతున్నారు. ఇటీవల నందిగామ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎంపీ తన అనుచరుడైన వీరంకి వీరాస్వామికి ఇవ్వాలని సూచించారు. అప్పుడు కూడా సౌమ్య పట్టుబట్టారు. మునిసిపల్ చైర్‌పర్సన్ విషయంలోనూ ఎంపీ కల్పించుకుని శాఖమూరి స్వర్ణలతకు మద్దతు తెలిపారన్నది ఎమ్మెల్యే సౌమ్య చెబుతున్నారు. అందుకే ఎన్నికను వాయిదా వరకు తీసుకొచ్చారని చెబుతున్నారు.

రాజీ పడాల్సి వస్తే రాజీనామా : తంగిరాల సౌమ్య

రాజీ పడాల్సి వస్తే రాజీనామా చేస్తా తప్ప.. ఎవరి ఒత్తిడి కి, బెదిరింపులకు లొంగేది లేదంటూ ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఆగ్రహంతో ఊగిపోయారు. తాను చంద్రబాబు, లోకేశ్‌కు మాత్రమే బద్ధురాలినని, తనపై పెత్తనం చేసేవారిపై కాదంటూ కన్నెర్రజేశారు. చైర్‌పర్సన్ ఎంపిక పూర్తిగా తన అధికార పరిధిలో ఉన్న అంశమని, ఇతరులెవరికీ శాసించే హక్కు లేదన్నారు.

ఆ నలుగురి రూటే సపరేటు!

(5వ పేజీ తరువాయి)

సంబంధించి కొందరు రైతుల తల్లిదండ్రుల పేరున భూములు ఉన్నాయి. ఈ భూములకు సరైన పత్రాలు, దస్తావేజులు లేవనే కారణాలు చూపి నగదును ఇవ్వకుండా ఆర్డీవో కార్యాలయంలో కీలక విభాగంలో పనిచేసే ఒక ఉద్యోగి చక్రం తిప్పుతున్నాడు. తహసీల్దార్ సర్వే చేయించి భూమి అనుభవదారులుగా ఉన్నట్లుగా కొందరి పేర్లను సూచించి, వారికి నగదు ఇవ్వవచ్చని అనుమతులు ఇచ్చాక కూడా.. రైతులు రిజిస్ట్రార్ కార్యాలయంలో భూమి సబ్‌డివిజన్ జరిగినట్లుగా ఆధారాలు తీసుకురమ్మని ఈ ఉద్యోగి కొర్రీలు పెట్టడం గమనార్హం. చిలకలపూడి, పోతేపల్లి, మేకావానిపాలెం గ్రామాల్లో 11 ఎకరాలకు రోడ్డు కం రైలు మార్గాలకు ఇచ్చిన భూమికి నగదు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారు. తమకు నగదు ఇప్పించాలని రైతులు ఈ ఉద్యోగి చుట్టూ ఏడాది కాలంగా తిరుగుతున్నారు. సదరు ఉద్యోగి మాత్రం ఎంత కాలం మా చుట్టూ తిరిగినా ప్రయోజనం ఉండదని, ఏదో ఒకటి చేస్తే మీపని ఇట్టే అయిపోతుందని నర్మగర్భంగా చెప్పడం గమనార్హం. ఇంతటితో ఆగని ఈ ఉద్యోగి ఒక వీఆర్వో ద్వారా ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగికి రైతుల నుంచి ఎంతో కొంత నగదు ఇప్పించవచ్చు కదా అని ఒక ప్రజాప్రతినిధి వద్దకు బేరానికి పంపినట్లు సమాచారం. రైతులు పోర్టు పనుల్లో భాగంగా రోడ్డు కం రైలు మార్గం కోసం భూములు వదులుకున్నారని, వారి నుంచి నగదు ఇప్పించమేంటని, తాను ఈ పనిచేయలేనని సదరు ప్రజాప్రతినిధి తెగేసి చెప్పినట్లు తెలిసింది. దీంతో రోడ్డు కం రైలు మార్గానికి భూములు ఇచ్చిన రైతులకు నగదు ఇవ్వకుండా ఈ ఉద్యోగి జాప్యం చేయడం గమనార్హం.

ఆ నలుగురు కూడబలుక్కుని మరీ..

కలెక్టరేట్‌లో భూమి అంశాలు చూసే ఉద్యోగి, ఆర్డీవో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి, వారికి అనుబంధంగా మరో ఇద్దరు ఉద్యోగులు కూడబలుక్కుని మరీ గుట్టుచప్పుడు కాకుండా భూమి వ్యవహారాల్లో నగదు వసూళ్లకు పాల్పడుతున్నారు. వీరి తీరుపై కలెక్టరేట్‌లో పనిచేసే ఉద్యోగులు బాహాటంగానే ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మూడున్నరేళ్ల బాలుడి

ఉసురుతీసిన మైనర్

(5వ పేజీ తరువాయి)

రూ.3 లక్షలు ఇచ్చి రాజీ చేసుకున్నారు. దాని తర్వాత కూడా తల్లిదండ్రులు మైనర్ కుమారుడికి బైక్‌ను ఇస్తూనే ఉన్నారు. తను మైనర్‌గా బైక్ నడపటమే కాకుండా మరో ఇద్దరిని ఎక్కించుకుని ర్యాష్‌గా బైక్ నడిపి మూడున్నరేళ్ల బాలుడు మృతికి కారణమయ్యాడు. గగన్ సాయి తండ్రి కిషోర్ ఫిర్యాదు మేరకు మైనర్ బాలుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సీహెచ్.అవినాష్ తెలిపారు. గగన్ సాయి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా తదితరులు పరామర్శించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	125,134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 480

వీవర్స్ ఫెడరేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ



గన్నవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : చేనేత కార్మికులంతా ఐక్యంగా ఉండాలని ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ గౌరవ అధ్యక్షులు నక్కిన చిన వెంకట్రాయుడు అన్నారు. స్థానిక మల్లికార్జున పాఠశాలలో ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ 27న జరిగే చేనేతల ఆత్మగౌరవం బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. చేనేత 18 కులాల కుటుంబీకులు సభకు తరలివెళ్లాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. సామల ఆంజనేయులు, నారద మునియ్య, వెంగల నాని, దార్నా శివాజీ, నందం బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలపాటిని పెద్దల సభకు పంపాలి

ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు



పోరంకిలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

పెనమలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ను పెద్దల సభకు పంపాలని గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. సోమవారం పోరంకి మురళీ రిసార్ట్సులో జరిగిన ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల ఆత్మీయ సమావేశంలో ఆయన రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజాలతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఆలపాటి గెలుపు లాంఛనమేనని, మెజారిటీపైనే కూటమి కార్యకర్తలు, నాయకులు దృష్టి సారించాలని సూచించారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని పేర్కొన్నారు. మెజారిటీ ఓట్లు పోల్ అయ్యేవిధంగా తెలుగుయువత సభ్యులు పని చేయాలన్నారు. గత ప్రభుత్వం అభివృద్ధిని అడ్డుకొందని, పరిశ్రమలు ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లిపోయాయని దుయ్య బట్టారు. గన్నవరం విమానాశ్రయ దుస్థితి గత ప్రభుత్వ పాలనకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు వడ్డాణం హరిబాబునాయుడు, కూటమి నాయకులు చిరుమామిళ్ల సూర్యం, బచ్చుల బోసుబాబు, చలమలశెట్టి రమేష్‌బాబు, కుమారస్వామి, కోట వీరబాబు, మూల్పూరి సాయికళ్యాణి, గూడవల్లి నరసింహారావు, గండవనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, ఆళ్ల వెంకటగోపాలకృష్ణ, ఫణికుమార్, దయాల రాజేశ్వరరావు, గొడ్డళ్ల చినరామారావు, వేగిరెడ్డి పాపా రావు, చిమట రవివర్మ, మేడేపల్లి రమ, కొండయ్య, బోడపాటి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్బయ్య మాస్టారు మృతి పార్టీకి తీరనిలోటు

గన్నవరం : సుబ్బయ్య మాస్టారు మృతి పార్టీకి తీరని లోటు అని, పార్టీకి, తన విజయానికి ఆయన చేసిన కృషి మరువలేనని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు, ఎస్సీ సెల్ మండల కార్యదర్శి కూచిపూడి సుబ్బయ్య (మాస్టారు) సోమవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మండలంలోని చనుపల్లివారిగూడెం గ్రామానికి చెందిన సుబ్బయ్య టీడీపీకి వీర విధేయుడు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం నెక్కలం గొల్లగూడెంలోని చుక్కపల్లి హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. కుమార్తె చదువు నిమిత్తం యనమదలకుదురులో ఉంటున్నారు. అక్కడ నుంచి ప్రతి రోజు పాఠశాలకు వస్తున్నారు. అదే క్రమంలో సోమవారం వస్తుండగా రామవరప్పాడు రింగ్ దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే యార్లగడ్డ చనుపల్లివారిగూడెం చేరుకుని మాస్టారు మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా నిచ్చారు. ఆయన వెంట రామినీడు బసవపూర్ణయ్య, బోడపాటి రవికు మార్, మేడేపల్లి రమాదేవి, మాదల రంగానాథ్ తదితరులు ఉన్నారు.

రంగన్నగూడెం భూముల విలువ పెంపు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్ర జ్యోతి) : వ్యవసాయ భూముల విలువ (మార్కెట్ వాల్యూ) పెంపుపై ప్రజాప్రతినిధుల కృషి ఎట్టకేలకు ఫలించింది. రంగన్నగూడెం గ్రామానికి చెందిన భూములు విలువలు పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు సోమవారం పంచాయితీకి అందాయి. వ్యవసాయ భూముల విలువలు చుట్టుప్రక్కల గ్రామాల కంటే తక్కువగా ఉన్నాయని పెంచాలని కోరుతూ జనవరి 30న సబ్ రిజిస్ట్రార్‌కు, అదే విధంగా జిల్లా రిజిస్ట్రార్‌కు స్థానిక ప్రజా ప్రతినిధులు వినతి పత్రాలను అందజేశారు. ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచు రితమైంది. వీటి ఆధారంగా రంగన్నగూడెంలోని వ్యవసాయ భూముల విలువ కనీస మార్కెట్ ధరగా రూ. 23 లక్షలు ఇళ్ల స్థలాలకు వినియోగించే భూమి విలువ రూ.30లక్షలు నిర్ణయించినట్లు ఉత్తర్వులు వెలువడ్డాయి. గ్రామంలో భూ ముల మార్కెట్ విలువ పెరిగేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావుకు గ్రామస్తుల తరపున సర్పంచ్ కసుకుర్తి రంగామణి, ఎంపీటీసీ పుసులూరి లక్ష్మీనారాయణ, సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల గోపాలకృష్ణ, తదితరులు ధన్యవాదములు తెలిపారు.

దివ్యాంగులు సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలి

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రత్యేక అవసరాలు కలిగి పింఛను పొందు తున్న లబ్ధిదారుల సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేస్తున్నట్లు బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ముందుగా చెవుడు, మూగ, అంధత్వ కారణంగా లబ్ధి పొందుతున్న 438 మందికి సోమవారం నుంచి మార్చి 17 వరకు గుడివాడ, మచిలీప ట్నం ప్రభుత్వ ఆసుపత్రిల్లో వెరిఫికేషన్ నిర్వహిస్తుననట్లు తెలిపారు. లబ్ధిదారులు తమ సర్టిఫికెట్లును వెరిఫికేషన్ చేయించుకోవాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా

పోలీసుల కళ్లుకప్పి అసాంఘిక కార్యకలాపాలు సాగించే వారిపై ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు తీసుకోనున్నట్లు ఎస్సై సురేశ్ తెలిపారు. సోమవారం ఎస్సై ఆధ్వర్యంలో కాకినాడ నుంచి వచ్చిన స్పెషల్ టీం సాయంతో డ్రోన్ కెమేరా ద్వారా అసాంఘిక కార్య కలాపాలు సాగించే ప్రాంతాలపై నిఘా నిర్వహించారు.



విజేతతో పాఠశాల యాజమాన్యం

తైక్వాండోలో కానూరు స్కాట్‌స్పైన్ విద్యార్థికి కాంస్యం

పెనమలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కానూరు స్కాట్‌స్పైన్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థిని పర్ణీతకు ఏడవ జాతీయ క్యురుగి, పూమ్సే తైక్వాండో ఛాంపియన్‌షిప్ బాలికల విభాగంలో జాతీయ స్థాయిలో కాంస్య పతకాన్ని సాధించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. గత నెల 28నుంచి 30వరకు హైదరాబాద్ కోట్ల విజయభాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థిని ఈ పతకాన్ని సాధించినట్లు తెలిపారు. విజేతను రవీంద్రభారతి సంస్థల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, డైరెక్టర్ శాంతి, సీఈఓ కొడాలి జాహ్నవి, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమలు అభినందించారు.

తిరుపతమ్మ కల్యాణ వేదిక నిర్మాణానికి విరాళాలు

గన్నవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరంలోని తిరుపతమ్మ తల్లి కల్యాణ వేదిక నిర్మాణానికి సోమవారం పలువురు విరాళాలను ఆలయ కమిటీ అధ్యక్షులు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. చంద్రపాటి ప్రసాదరావు(బాజీ) అనురాధ దంపతులు రూ.50,127, జాస్తి సూర్యప్రకాశరావు, సీతారావమ్మ జ్ఞాపకార్థం వారి ముని మనవడు అన్నే గోపీకృష్ణ 50,116, ముక్కామల జగదీశ్వరరావు, రత్నకుమారి దంపతులు రూ.51,116, సబ్బినేని బాబూరావు జ్ఞాపకార్థం కుమారుడు మోహిత్ సాయితేజ రూ.25వేలు, కాసన్నేని మధుసూదనరావు రూ.25వేలు విరాళాలు అందజేశారు. పోట్ల శివలీల, జాస్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడి

గన్నవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : సస్యరక్షణ చర్య లతోనే అధిక దిగుబడి సాధ్యమని శాస్త్రవేత్త డి.సుధారాణి అన్నారు. మండలంలోని బల్లిపర్రు గ్రామంలో మినుము మొక్కజొన్న పంటలపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ, మినుము పంటలో పురుగు మందులను ఎక్కువగా వాడకూడదన్నారు. దాని వలన ఎన్నో అనర్థాలు ఉన్నాయని వివరించారు. నేల క్షీణించి మొక్క పెరుగుదల నశిస్తుందని తెలిపారు. బూడిద తెగులు కాండం ఈగ గుర్తించటం జరుగుతుందని తెలిపారు. ఏవో రజని, వీపీఏ శివనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటల పోటీల ఓవరాల్ చాంపియన్ ఉయ్యూరు జడ్పీ హైస్కూల్

ఉయ్యూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు నియోజకవర్గ స్థాయి 84వ బాలికల గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీల్లో ఉయ్యూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొని అత్యంత ప్రతిభ కనపరిచి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. ఇటీవల ఈడుపుగల్లు, ఆకునూరులో జరిగిన సబ్‌జోన్ పోటీల్లో సీనియర్ బాలుర విభాగం, జూనియర్ బాలుర విభాగం, సీనియర్ బాలికల విభాగం, జూనియర్ బాలికల విభాగంలో పతకాలు సాధించారు. వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు జీవీ రమణ, జీఆర్‌ఎం లాల్‌ను ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పి శ్రీనివాసరావు, స్టాఫ్ సెక్రటరీ కె నాగకుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.

తెన్నేరు విద్యార్థుల ప్రతిభ

కంకిపాడు : సబ్ జోన్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పలు పతకాలు సాధించారని తెన్నేరు జిల్లా పరిషత్ పాఠశాల స్కూల్ కమిటీ చైర్మన్ లంక నాగబాబు తెలిపారు. సబ్ జోన్ పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం ఆయన అభినందించారు. హెచ్‌ఎం రోజ్‌మేరీ, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉయ్యూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరులో విద్యుత్‌లైన్ల మరమ్మతుల్ల నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. మంగళవారం ఉదయం 7-30 నుంచి మధ్యాహ్నం 12-30 గంటల వరకు బంగళా సెంటర్ నుంచి గిరిజన కాలనీ వరకు సరఫరా ఉండదని ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు ఈఈ కృష్ణనాయక్ తెలిపారు.

వైద్యులకు సత్కారం

ఉయ్యూరు. ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జాతీయ మహిళా వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని గండిగుంట సీహెచ్‌సీలో మహిళా వైద్యులను ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహిళా వైద్యులు తేజస్విని, నాగస్వరూప, రోహిణిలకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఏవో శివశంకరరావు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుపై నెప్పల్లిలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ



నెప్పల్లిలో ఇరు వర్గాలతో మాట్లాడుతున్న తహసీల్దార్ భవన్నారాయణ, సీఐ మురళీకృష్ణ

కంకిపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నెప్పల్లిలో ఆదివారం అర్ధరాత్రి ఘర్షణ నెలకొంది. నువ్వా నేనా అంటూ ఇరు వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. సంఘటన స్థలానికి చేరుకున్న రెవెన్యూ, పోలీసులు ఇరు వర్గాలకు నచ్చ చెప్పి పంపించి వేశారు. నెప్పల్లిలో పంచా యతీ పోరంబోకు స్థలంలో ఎస్సీ వర్గానికి చెందిన పలువురు అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటు కు పూనుకున్నారు. దీంతో మైనార్టీ కుటుంబాలు మా నివాసాల మధ్య విగ్రహం ఏర్పాటు చేయడం ఏంటంటూ ఎస్సీ నాయకులను నిలదీశారు. దీంతో విగ్రహ ఏర్పాటు విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న తహసీల్దార్ భవన్నారాయణ, వీఆర్వో రఘురామ ప్రసాద్, సీఐ మురళీకృష్ణ, ఎస్సై సందీప్, తాతాచార్యులు సిబ్బందితో కలిసి హుటాహుటిన నెప్పల్లి చేరుకున్నారు. ఇరువర్గాలతో చర్చించారు. ఎన్నికల నియమావళి ఉన్నందున విగ్రహ ఏర్పాటు సాధ్యం కాదని, నియామవళి అయిన తరువాత విగ్రహ ఏర్పాటుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇరు వర్గాలను అక్కడ నుంచి పంపించి వేశారు.

రామవరప్పాడులో ఆక్రమణల తొలగింపు



ముఠా కార్మికుల కార్యాలయాన్ని తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

గుణదల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం హయాంలో రామవరప్పాడు రైవస్ కాల్వకట్ట వెంబడి వైసీపీ నాయకుడు నిర్మించిన ముఠా కార్మికుల కార్యాలయంను సోమవారం పంచాయతీ సిబ్బంది తొలగించారు. రామవరప్పాడు రైవస్ కాల్వ వెంబడి ఉన్న ఖాళీ స్థలాల్లో ముఠా కార్మికుల కార్యాలయం.. రైతుబజార్.. కృష్ణుని గుడి అం టూ ఆయా స్థలాలను వారి అనుయాయులకు అప్పటి వైసీపీ నాయకుడు ధారా దత్తం చేశారు. దీంతో సర్వీస్ రోడ్డు ఏర్పాటు విషయం మరుగున పడిపోయింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ విషయాన్ని రామవరప్పాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడు నబిగాని కొండ, విజయవాడ రూరల్ మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు కొల్లా ఆనంద్‌లు ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి సమస్య తీసుకెళ్లారు. విషయాన్ని సానుకూలంగా విన్న ఆయన గ్రామస్తుల క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో శనివారం వంతెన సెంటర్ వద్ద సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు అడ్డుగా ఉన్న హాకర్లను గ్రామ టీడీపీ నాయకులు స్వయంగా దగ్గరుండి తొలగించారు.

సర్వీస్ రోడ్డు ఏర్పాటుతో ప్రమాదాలకు చెక్

రామవరప్పాడు వంతెన సెంటర్ నుంచి చెక్‌పోస్టు సెంటర్ వరకు రైవస్ కాల్వ వెంబడి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంది. సర్వీస్ రోడ్డు లేకపోవడంతో వాహనచోదకులు వన్‌వేలో ప్రయాణాలు చేస్తుండటంతో ట్రాఫిక్ పోలీసులకు ఇది తలనొప్పిగా తయారైంది. ట్రాఫిక్ జామ్ తగ్గడంతోపాటు ప్రమాదాలు తగ్గే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి.

మార్కెట్లోకి కియా సిరోస్ కారు



జ్యోతి వెలిగిస్తున్న చైర్మన్ రావెళ్ల సుబ్బయ్య, డైరెక్టర్ రావెళ్ల రస్య, ఎల్‌ఎల్ మారుతీకుమార్

భారతీనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆటోమొబైల్ రంగంలో కియా మోటార్స్ నూతన టెక్నాలజీతో కూడిన సిరోస్ కారును సోమవారం నాగార్జున నగర్ కాలనీలోని సింహామోటార్స్ షోరూంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సింహా మోటార్స్ చైర్మన్ రావెళ్ల సుబ్బయ్య, డైరెక్టర్ రావెళ్ల రస్య,సేల్ అధికారి ఎల్.ఎల్. మారుతీకుమార్ పాల్గొని జ్యోతి వెలిగించారు. అనంతరం కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా మారుతీకుమార్ మాట్లాడుతూ, ఈ నూతన సిరోస్ కారులో 12.3 అంగుళాల టచ్ స్క్రీన్, 12.3 అంగుళాల క్లస్టర్, 5అంగుళాల ఏసీ కంట్రో ల్స్ అన్ని కలిసి ఒకే 30 అంగుళాల ట్రినిటీ పానరోమిక్ డిస్‌ప్లే కలిగి ఉంటుందన్నారు. వీటితో పాటు వెనుక సీట్లు కూడా వెంటిలేషన్, రీక్లైనింగ్, స్లైడింగ్ సౌకర్యాలు ఉంటా యన్నారు. 20స్టాండర్డ్ భద్రతా ప్రమాణాలను కలిగి ఉంటాయన్నారు. పెట్రోల్, డీజి ల్, ఆటోమ్యాటిక్, మాన్యువల్ వేరియంట్స్‌లలో 8 ఆకర్షణీయమైన రంగుల్లో లభిస్తాయన్నారు. దీని ప్రారంభ ధర రూ.8,99,900(ఎక్స్ షోరూం ధర)గా ఉందన్నారు. కార్ల బుకింగ్ కొరకు సింహా మోటార్స్ షోరూంలో సంప్రదించవచ్చునని తెలిపారు.

వీరమ్మ తిరునాళ్లపై ఆర్డీవో సమీక్ష



కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హెలా షారోన్

ఉయ్యూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లలో ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా ముగిసేలా ఆలయ కమిటీ, అధికారులు చర్యలు తీసుకోవాలని ఉయ్యూరు ఆర్డీవో హెలా షారోన్ అన్నారు. ఈ నెల 8 నుంచి వీరమ్మ తిరునాళ్ల ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం ఆలయ ప్రాంగణాన్ని తహసీల్దార్ సురేశ్ కుమార్, ఎంపీడీవో శేషగిరిరావు ఇతర అధికారులతో కలసి పరిశీలించారు. నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎస్సై విశ్వనాథ్ పాల్గొన్నారు.

రథసప్తమి వేడుకలకు శ్రీక్షేత్ర హనుమత్‌పురం సిద్ధం

గన్నవరం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో రథసప్తమి వేడుకలు ప్రారంభమయ్యాయి. సోమవారం సూర్యనారాయణ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులు పూజలు నిర్వహించి నైవేద్యాలను సమర్పించారు. మంగళవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు ప్రారంభం కానున్నాయని ఆలయ నిర్వాహకులు చిట్టినేని వంశీకృష్ణ తెలిపారు. ఉదయం సూర్యకిరణ స్పర్శ దర్శనం, చిన్న పిల్లలచే సామూహికంగా సూర్యనమస్కారాలు, 108మందితో దేవాలయాల వద్ద స్వామివారికి సామూహిక పొంగళ్లు అనంతరం ఉషాపద్మినీ సమేత సూర్యనారయణ స్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరుగుతుందన్నారు.

అభివృద్ధి పనుల్లో పెనమలూరు ముందంజ

● త్వరలో మరో రైతు బజారు ప్రారంభం
● పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై కూటమి నేతల సమావేశంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్



పోరంకి టీడీపీ కార్యాలయంలో కూటమి నేతల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధిలో రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో కన్న పెనమలూరు ముందంజలో ఉందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో గుంటూరు, కృష్ణా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక కార్యక్రమంలో భాగంగా కూటమి నేతలు, కార్యకర్తల ఉమ్మడి సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యకర్తలందరికీ అభివృద్ధి పనుల్లో వాటాలు కేటాయించి వారికి సముచిత ప్రాధాన్యత కల్పిస్తామని హామీ ఇచ్చారు. తాడిగడప మునిసిపాలిటీలో గతంలో ప్రారంభించిన రైతు బజారుకు తోడు మరో రైతు బజారును ప్రారంభించి కార్యకర్తలను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డి బారి నుంచి ముందు రాష్ట్రాన్ని కాపాడుకున్నామని పేర్కొన్నారు. నియోజకవర్గంలో గతంలో ఎన్టీఆర్ హయాంలో కేటాయించిన ఇళ్ల పట్టాల విషయంలో లబ్ధిదారులకు శాశ్వత హక్కు కల్పించి లబ్ధిదారులకు సహకరించాలని టీడీపీ నాయకులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్సీ అశోక్‌బాబులను అభ్యర్థించారు. తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షుడు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో టీడీపీలో 2014, 2019 ఎన్నికల్లో ఎన్నికల నిర్వహణలో రోల్‌మోడల్‌గా బోడె ప్రసాద్ నిలిచారన్నారు. పదహారువేల యాక్టివ్ కార్యకర్తల్లో కనీసం ఐదువందల మందిని హార్డుకోర్ కార్యకర్తలుగా మార్చగలిగితే నియోజకవర్గాల్లో భవిష్యత్తులో ఎదురులేకుండా ఉంటుందని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆలపాటి రాజాను అత్యంత భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పైపులైన్ పనులు పరిశీలించిన కలెక్టర్

ఎ.కొండూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కిడ్నీ వ్యాధిగ్రస్థులకు సురక్షిత కృష్ణా జలాల సరఫరా పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఆర్‌డబ్ల్యూఎస్ అధికార్లను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రమైన ఎ.కొండూరులో పైపులైన్ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.50 కోట్లుతో చేపట్టిన పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. 38 గ్రామాల్లో అదనంగా 14 వాటర్ ట్యాంక్‌లు నిర్మిస్తునట్టు తెలిపారు. 200 కిలో మీటర్ల పైపులైన్ పనులు ఎంతవరకు జరిగాయని అధికార్లను ప్రశ్నించారు. కిడ్నీ బాధితులకు సురక్షితమైన తాగునీరు అందజేయడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, నిర్దేశించిన లక్ష్యంలోపు పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆర్‌డీవో మాధురి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ విద్యాసాగర్ ఇతర అధికార్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు
సౌర విద్యుత్‌ను అందించండి

● లోక్‌సభలో ఎంపీ కేశినేని శివనాథ్

వన్‌టౌన్, విజయవాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పీఎం సూర్యఘర్ పథకం కింద సౌర విద్యుత్ అందించాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సోమవారం కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. లోక్‌సభలో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో 55,607 అంగన్‌వాడీ కేంద్రాలుండగా,8,455 కేంద్రాలకు విద్యుదీకరణ సౌకర్యం లేదన్నారు. చిన్నారులకు మౌలిక సదుపాయాల కల్పనను దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీలను పీఎం సూర్యఘర్ పథకంలో చేర్చాలన్నారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగేందుకు అవకాశం ఉన్న దృష్ట్యా సూర్యఘర్ పథకం అవసరమన్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జిల్లాలో సూర్యఘర్ పథకాన్ని విస్తృతంగా అమలు చేయడంలో కలెక్టర్‌తో కలిసి నిర్వహిస్తున్న కార్యక్రమాలను ఆయన గుర్తు చేశారు.

జాతీయ క్రీడల్లో సత్యజ్యోతికి కాంస్యం

● అభినందించిన శాప్ చైర్మన్ రవినాయుడు

లబ్బీపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న జాతీయ క్రీడాపోటీల్లో రాష్ట్ర క్రీడాకారిణి వెయిట్ లిఫ్టింగ్ 87 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించింది. విజయనగరానికి చెందిన టి.సత్యజ్యోతి ఈ ఘనత సాధించడంపై శాప్ చైర్మన్ రవినాయుడు ఫోన్‌లో అభినందనలు తెలిపారు. ఈమె విజయం క్రీడాకారిణులకు స్ఫూర్తిదాయకమని, ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాల సహకారం అందిస్తుందన్నారు.

దుర్గగుడిలో వేదోక్తంగా సరస్వతీ యాగం

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీపంచమి సందర్భంగా దుర్గగుడిలో సరస్వతీయాగాన్ని వేదోక్తంగా నిర్వహించారు. శ్రీ పంచమి నాడు అమ్మవారు ఆవిర్భవించారని నమ్మిక. దీంతో దేవస్థానంలో ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు. దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్, దుర్గగుడి ఇన్‌చార్జి ఈవో కే రామచంద్రమోహన్ పూజల్లో పాల్గొని వేద పండితుల ఆశీస్సులు అందుకున్నారు. కనకదుర్గమ్మ మూలవిరాట్టును మహామండపంలోని వేదికపై ప్రతిష్ఠించిన దుర్గాదేవి అర్చనా మూర్తిని సరస్వతిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. విద్యార్థులు పెద్దసంఖ్యలో విచ్చేసి పూజలో పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. విద్యార్థులకు రక్షాకంకణం, పెన్ను, లడ్డూ ప్రసాదం, అమ్మవారి ప్యాకెట్ సైజు చిత్రపటాన్ని ఈవో అందజేశారు. పలువురు తల్లి తండ్రులు తమ బిడ్డలకు అక్షరాభ్యాసం చేయించారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి దుర్గమ్మను దర్శించుకున్నారు.



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన లారీ క్యాబిన్

రోడ్డు ప్రమాదంలో తెగిపడిన డ్రైవర్ కాలు

కంచికచర్ల రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): కంచికచర్ల-కీసర జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తన కాలును కోల్పోయాడు. విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే జాతీయ రహదారిపై టోల్‌గేట్‌కు సంబంధించిన వాటర్ ట్యాంక్ లారీ మొక్కలకు నీరు పడుతుండగా అదేమార్గంలో హైదరాబాద్ వెళుతున్న మరో లారీ వాటర్ ట్యాంక్ వెనుక భాగంలో బలంగా ఢీ కొనడంతో ప్రమాదం జరిగింది. సూర్యాపేట జిల్లా మునగాల మండలం నర్సన్నగూడెం గ్రామానికి చెందిన పెద్ది నాగార్జున క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. పోలీసులు, టోల్‌గేట్ సిబ్బంది అతికష్టం మీద డ్రైవర్‌ను క్యాబిన్ నుంచి బయటకు తీశారు. డ్రైవర్ ఎడమ కాలు క్యాబిన్‌లో తెగిపడిపోవడంతో స్పృహ కోల్పోయాడు. డ్రైవర్‌ను చికిత్స నిమిత్తం నందిగామ ప్రభుత్వాసుపత్రికి పంపి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సోనుసూద్‌కు కిడ్డీబ్యాంక్ సొమ్ములిచ్చిన చిన్నారులు

పటమట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అమ్మానాన్నలిచ్చిన సొమ్మును కిడ్డీ బ్యాం క్‌లో దాచుకున్న ఇద్దరు చిన్నారులు సోనుసూద్ ఫౌండేషన్‌కు సోమవారం అందించారు. విజయవాడ పర్యటనకు వచ్చిన సోనోసూద్‌ను దుద్దేల వరుణ్‌గౌతమ్, దుద్దేల పుష్కల్ నోవెటెల్ హోటల్లో కలిసి వారు దాచుకున్న సొమ్మును ఆయనకు అందించారు. వారిద్దరినీ సోను అభినందించా రు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమా లు చేయాలని వారికి సూచించారు.


చిన్నారులను అభినందిస్తున్న సోనూ

గన్నవరం: ప్రముఖ సినీనటుడు సోనుసూద్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం ఉదయం సీఎం చంద్రబాబును కలిసి రాష్ట్రానికి 4 అంబులెన్స్‌లను అందించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో హైదారాబాద్ వెళ్లేందుకు గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్న సోనుసూద్ ఎమ్మెల్యే యార్లగడ్డను కలిశారు. ఈ సందర్భంగా సోనుసూద్ చేస్తున్న సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే యార్లగడ్డ అభినందించారు. ఇటు సినిమాల్లో రాణిస్తూ అటు సేవా కార్యక్రమాలు చేయడం పట్ల అభినందనలు తెలియజేశారు.

అంబాపురం పంచాయతీలో స్థల వివాదం

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామ పంచాయితీ పరిధిలోని ఓ స్థలం విషయమై ఇరువర్గాల మధ్య సోమవారం వివాదం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం పంచాయితీ పరిధిలోని 1వ వార్డులో సుమారు 2వేల గజాల స్థలంలో కొందరు వ్యక్తులు ఫెన్సింగ్ వేస్తుండగా స్థానికులు కొందరు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పంచాయతీ భూమి కబ్జాకు గురవుతుందని, వాటిని కాపాడాలంటూ స్థానికులు ఫ్లెక్సీతో నిరసన తెలిపారు. అయితే ఫెన్సింగ్ వేస్తున్న వ్యక్తులు మాత్రం స్థలాన్ని తాము కొనుగోలు చేశామని అన్ని ఆధారాలు ఉన్నాయని, హైకోర్టు కూడా పొజిషన్‌లోకి వెళ్లడానికి అనుమతిచ్చిందని చూపించారు. స్థానికులకు ఈ విషయంపై అవగాహన లేక తమపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు.

11 నుంచి తిరుపతమ్మ పెద్ద తిరునాళ్ల

● దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్‌కు ఆహ్వానం

ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 2: ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 11 నుంచి 15 వరకు పెద్దతిరునాళ్ల, కల్యాణ మహోత్సవాలు జరగనున్నాయి. దుర్గగుడి ఇన్‌చార్జి ఈవో, దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా కూడా ఉన్న కే రామచంద్రమోహన్‌ను తిరుపతమ్మ దేవస్థానం ఈవో, బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్ కుమార్, ఈఈ లింగం రమతో కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. తిరుపతమ్మ దేవస్థానం వేదపండితులు, అర్చకులు రామచంద్ర మోహన్‌కు ఆశీస్సులు అందించారు. గోపయ్య సమేత తిరుపతమ్మ అమ్మవారి మహా కల్యాణ మహోత్సవం ఈనెల 11న రాత్రి 9.32 గంటలకు ప్రారంభం కానుంది.


ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

యథేచ్ఛగా అక్రమాలు


డ్రైనేజీ మూసేసి మెట్లు నిర్మిస్తున్న కార్మికులు

● అనుమతులు లేకుండా స్టేడియం కమిటీ నిర్మాణాలు ● దగ్గరుండి మరీ పర్యవేక్షించిన మున్సిపల్ అధికారులు ● బహిరంగ వేలంలో షాపులు దక్కించుకున్న గడ్డం గ్యాంగ్ అనుచరులు

అక్రమ నిర్మాణాలపై మున్సిపల్, సీఆర్‌డీఏ అధికారులు కొరడా ఝుళిపిస్తుంటారు. మరీ అధికారులే దగ్గరుండి అక్రమ నిర్మాణం చేపడితే వారి పై ఎవరు చర్యలు తీసుకోవాలి. ఏకంగా జిల్లా కలెక్టరే చైర్మన్‌గా వ్యవహరించే ఎన్టీఆర్ స్టేడియం కమిటీ నిబంధనలన్నీ తుంగలో తొక్కి అక్రమ నిర్మాణం చేసేశారు. ఆంధ్రజ్యోతి-గుడివాడ

స్థానిక నందమూరి తారకరామారావు స్టేడియం కమిటీ చైర్మన్ నేతృత్వంలో ఎన్టీఆర్ స్టేడియంలో కార్యకలాపాలు నిర్వహిస్తుంటుంది. ఇండోర్ స్టేడియం పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో పిల్లల పార్కు ఉండేది. మాజీ మంత్రి కొడాలి నాని హయాంలో స్టేడియం కమిటీ పార్కును తొలగించి రైతుబజారు ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలోకి మార్చారు. పార్కు స్థలంలో అప్పటి స్టేడియం కమిటీ చైర్మన్‌గా ఉన్న కలెక్టర్, అధికారులు, కమిటీ సభ్యుల అనుమతులతో జీ ప్లస్ టూ భారీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని హుటాహుటిన పూర్తిచేసి బహిరంగ వేలం ద్వారా లీజులకు ఇచ్చేశారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంలో ఎక్కడా నిబంధనలు పాటించిన దాఖలాలు లేవు. భవన నిర్మాణానికి మున్సిపాల్టీ నుంచి గానీ, సీఆర్‌డీఏ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోలేదు, కనీసం దరఖాస్తు కూడా చేయలేదని సమాచారం. అలాగే అగ్నిమాపక శాఖ నుంచి ఎన్‌వోసీ కూడా తీసుకోలేదు.

ఎన్నికలు దగ్గరపడుతుండటంతో 2024 అక్టోబరు 23న మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని చేతుల మీదుగా ఈ కాంప్లెక్స్‌ను హడావుడిగా ప్రారంభించారు. స్టేడియం షాపింగ్ కాంప్లెక్స్ భవన నిర్మాణం పూర్తి చేయకుండానే దుకాణాల బహిరంగ వేలం కూడా నిర్వహించారు. దుకాణ సముదాయ నిర్మాణానికి స్టేడియం కమిటీ రూ.1.50 కోట్లు ఖర్చు చేయగా, వేలం ద్వారా రూ.1.66కోట్లు ఆదాయం సమకూరినట్టు సమాచారం.

ఈ బహిరంగ వేలంలో అప్పటి నాని అనుచరులే దుకాణాలు దక్కించుకున్నట్టు సమాచారం.

మున్సిపాల్టీ, సీఆర్‌డీఏ నుంచి అనుమతులు చేపట్టిన నిర్మాణానికి మున్సిపల్ ఇంజినీర్లు పర్యవేక్షిస్తుంటారు. అయితే ఇది అక్రమ నిర్మాణమని తెలిసినా మున్సిపల్ ఇంజినీర్లు దగ్గరుండి నిర్మాణం చేపట్టడంపై పట్టణవాసులు ఆశ్చర్యచకితులయ్యారు. అప్పటి మంత్రి కొడాలి నాని ఒత్తిడి, కమిటీ సిఫారసుతో ఈ అక్రమ నిర్మాణాన్ని హుటాహుటిన పూర్తి చేశారు. కమిటీలో జిల్లా కలెక్టర్, ఆర్‌డీవో, తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్ కీలక సభ్యులుగా ఉండి కూడా ఈ అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహించడంపై పట్టణవాసులు ఆక్షేపణ తెలిపారు.


ప్రారంభోత్సవ శిలాఫలకం

కన్నెత్తి చూడని మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం

జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న అక్రమ నిర్మాణం కావడంతో అధికారులు కన్నెత్తి చూడలేదు. ముఖ్యంగా మున్సిపాల్టీ పట్టణ ప్రణాళిక విభాగ అధికారులు అక్రమ నిర్మాణంపై ఎలాంటి నోటీసులుచ్చిన దాఖలాలు లేవు. పట్టణంలో నిర్మాణాలకు నోటీసులిచ్చి హడావుడి చేసే మున్సిపల్ అధికారులు ఈ భవనం వైపు కన్నెత్తి చూడకపోవడంపై భవన యజమానులు పెదవివిరుస్తున్నారు.

డ్రైనేజీ వ్యవస్థ లేకుండానే..

నిర్మాణ సమయంలో నిబంధనలు పాటించలేదు. డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసిన దాఖలాల్లేవు. ప్రధాన రహదారి వెంబడి డ్రైనేజీ స్థలాన్ని సైతం మూసివేసినట్టు సమాచారం. ప్రధాన స్టేడియం వైపున్న డ్రైనేజీని కూడా మూసి వేసి మెట్లు కట్టారు.

అధికారుల వివరణ:

దీనిపై మున్సిపల్ కమిషనర్ బోనం శ్రీనివాసరావు వివరణ ఇస్తూ ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఆధ్వర్యంలో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌కు అనుమతుల వ్యవహారంలో పరిశీలన చేస్తామని అన్నారు. అగ్నిమాపక శాఖ అధికారి మాట్లాడుతూ ఈ కాంప్లెక్స్ నిర్మాణానికి సంబంధించి తమకు ఎలాంటి దరఖాస్తు అందలేదని, తాము ఎవరికీ ఎన్‌వోసీ జారీ చేయలేదని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న ఐజీ రవి కృష్ణ, వేదికపై పోలీసు కమిషనర్ రాజశేఖర్ బాబు

డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే భవిష్యత్

● ఐజీ రవి కృష్ణ

మొగల్రాజపురం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యాన్ని నాశనం చేసే చెడు అలవాట్లలో మాదకద్రవ్యాలు ఒకటని, అలాంటి వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని ఈగల్ వింగ్, ఏపీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ జనరల్ ఏ రవికృష్ణ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాలలో సోమవారం 'సే నో టు డ్రగ్స్' పేరుతో అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ 1985 నాటి మాదకద్రవ్యాల చట్టం కఠినంగా అమలవుతోందని. ఏ కారణం చేతయినా మాదకద్రవ్యాల కేసుల్లో విద్యార్థులు పట్టుపడితే కనీసం 20ఏళ్ల కఠిన జైలుశిక్ష పడుతుందని హెచ్చరించారు. సరఫరా దారుల గురించి సమాచారం తెలిస్తే 1972 నెంబరుకు సమాచారం ఇవ్వాలని సూచించారు. పోలీసు అధికారి కే నగేష్ బాబు మాట్లాడుతూ చెడు అలవాట్లకు లోనయితే జీవితం ఉండదన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ మనిషి జీవితంలో ఎదగాలంటే చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, బలహీనతలను జయించే మానసిక స్థైర్యం యువత సాధించాలన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం ఈగల్ టీం పనిచేస్తోందన్నారు. అనంతరం విద్యార్థుల ప్రశ్నలకు ఐజీ రవికృష్ణ, పోలీసు అధికారి నగేష్‌బాబు సమాధానాలు చెప్పారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ జంపాల, ఆంగ్ల అధ్యాపకులు డాక్టర్ శ్రీలత, సీహెచ్ రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండేళ్లలో రైల్వేట్రాక్స్‌కు
నూరుశాతం విద్యుదీకరణ

● డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

రైల్వేస్టేషన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రాబోయే రెండేళ్లలో రైల్వేట్రాక్‌లన్నీ నూరు శాతం విద్యుదీకరణ అవుతాయని డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ తెలిపారు. రైల్వే ట్రాక్‌కు విద్యుదీకరణ జరిగి వందేళ్లయిన సందర్భంగా సోమవారం విజయవాడ రైల్వేస్టేషన్‌లో నిర్వహించిన వాకథాన్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇదొక చారిత్రక క్షణమన్నారు. ప్రస్తుతం 64,421 కిలోమీటర్ల మేరకు 96.99 శాతం ట్రాక్ విద్యుదీకరణ జరిగిందని, రాబోయే రెండేళ్లలో పూర్తిగా ట్రాక్ విద్యుదీకరణ జరుగుతుందన్నారు. స్వాతంత్రానికి ముందు కేవలం 387 కిలో మీటర్లే విద్యుదీకరణ జరిగిందన్నారు.విజయవాడ డివిజన్ సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ సీహెచ్ దినేష్‌రెడ్డి మాట్లాడుతూ, డివిజన్‌లో 99.6 శాతం విద్యుదీకరణ జరిగిందన్నారు. కోటిపల్లి - కాకినాడ సింగిల్ లైన్‌లో అక్కడక్కడ పెండింగు ఉన్నాయన్నారు. 1,009.997 రూట్ కిలోమీటర్లు, 2,875.74 ట్రాక్ కిలో మీటర్ల మేర విద్యుదీకరణ పూర్తయిందన్నారు. దీనికి సంబంధించి ఫొటో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. విక్టోరియా టెర్మినస్ మొట్టమొదటి సారి విద్యుదీకరణ జరిగిందని, అదిప్పుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్‌గా మారిందన్నారు. టెర్మినస్-కుర్లా మధ్య జరిగిన కార్యక్రమంలో రైల్వే సిబ్బంది, ప్రయాణికులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను స్కూల్ విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.


రైల్వే ఉద్యోగుల వాకథాన్

కళాశాల నిర్లక్ష్యమే
హర్షిణి ప్రియ మృతికి కారణం

● సమగ్ర విచారణ చేయాలంటూ ఎస్ఎఫ్ఐ డిమాండ్

● కళాశాల నిర్లక్ష్యం లేదు: ప్రిన్సిపాల్



లబ్బీపేట, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అక్కల హర్షిని ప్రియ సోమవారం ఫిట్స్‌తో చనిపోవడంలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం ఉందని, దీనిపై సమగ్ర విచారణ చేయాలని ఎస్ఎఫ్ఐ విజయవాడ ఈస్ట్ కార్యదర్శి కుమారస్వామి డిమాండ్ చేశారు. ఉదయం 9గంటల సమయంలో విద్యార్థిని క్లాస్‌రూమ్‌లో ఫిట్స్‌తో పడిపోగా వెంటనే కళాశాల అధ్యాపకులు విద్యార్థిని తల్లికి ఫోన్‌లో సమాచారం ఇవ్వడంతో ఆమె అక్కడికి చేరుకుని అంబులెన్స్‌లో ప్రభుత్వాసుపత్రికి తరలించగా డాక్టర్లు పరిశీలించి మృతి చెందినట్లు ధ్రువీకరించారన్నారు. కళాశాల యాజయాన్యం నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని మృతి చెందిందని దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తమ కళాశాల విద్యార్థిని అనారోగ్యంతో మృతి చెందితే తమ నిర్లక్ష్యం అనడం సమంజసం కాదని ప్రిన్సిపాల్ తెలిపారు. విద్యార్థినికి ఫిట్స్ వచ్చిన వెంటనే ఆమె తల్లికి ఫోన్ చేయగా ఆమె చెప్పినట్లు తాళాలు చేతిలో పెట్టామని వెంటనే అంబులెన్స్ పిలిపించగా అందులో విద్యార్థిని తల్లి, బంధువులు, కళాశాల నుంచి కూడా హాస్పిటల్‌కు వెళ్లారని అక్కడికి వెళ్లిన తరువాత వైద్యులు ఎంత ప్రయత్నించినా ఫలితం లేకపోయిందన్నారు. పెదపులిపాకలోని విద్యార్థిని అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్న మృతదేహాన్ని పరామర్శించి తల్లికి ధైర్యం చెప్పామన్నారు. ఆ సమయంలో పాప తండ్రి కూడా చిన్న వయసులోనే ఫిట్స్‌తో మృతి చెందినట్టు తమకు చెప్పారన్నారు. ఈ విద్యార్థినికి కూడా మూడేళ్ల నుంచే ఈ సమస్య ఉందని తెలిపారన్నారు. ఈ విషయంలో తమ కళాశాల నిర్లక్ష్యం ఎక్కడా లేదన్నారు. విద్యార్థిని మృతితో కళాశాలకు మంగళవారం సెలవు ప్రకటించామన్నారు.

ప్రైవేట్ భూముల్లో కెమికల్ వ్యర్థాల డంపింగ్

● వంద ఎకరాల్లో భూములపై ప్రభావం.. రంగుమారిన వైనం

● ల్విక్విడ్ ట్యాంకర్‌ను డ్రైవర్ సహా పట్టుకున్న భూ యజమానులు



ట్యాంకర్‌ను అడ్డగించిన రైతులు, ప్లాట్ల యజమానులు, నలుపు రంగులోకి మారిన భూమి

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం జక్కంపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని ఓ ప్రైవేట్ వెంచర్‌లో గుట్టు చప్పుడు కాకుండా కెమికల్ ఫ్యాక్టరీ వ్యర్థ రసాయినాల డంపింగ్ వ్యవహారం సోమవారం స్థానికంగా కలకలం రేపింది. ఏడాదిగా జరుగుతున్న ఈ డంపింగ్‌తో సుమారు వంద ఎకరాలకు పైగా భూములు దుష్ప్రభావానికి గురయ్యాయి. ఆలస్యంగా గుర్తించిన ప్లాట్ల యజమానులు డంపింగ్ చేస్తున్న ట్యాంకర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు.

జక్కంపూడి పంచాయతీ పరిధిలో దశాబ్దాల క్రితం రైతులు, ప్రభుత్వ భాగస్వామ్యంతో 60-40 వెంచర్‌ను ఏర్పాటు చేశారు. 135 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటైన వెంచర్‌లో 711 ప్లాట్లున్నాయి. కొన్ని అమ్ముడవగా చాలా వరకు రైతుల ఆధీనంలోనే ఉన్నాయి. కొంతకాలంగా వెంచర్ నుంచి విపరీతమైన దుర్వాసన వస్తుండటం రైతులు, ప్లాట్ల యజమానులు గుర్తించారు. మొదట్లో పెద్దగా పట్టించుకోకపోయినా, ఇటీవల దుర్వాసన విపరీతంగా వస్తుండటం, భూములు రంగు మారుతుండటం గమనించారు. నేపథ్యంలో ఆదివారం రాత్రి నుంచి కొంతమంది కలిసి వెంచర్‌లో గస్తీ నిర్వహించారు. అనుకున్నట్టుగానే సోమవారం తెల్లవారుజామున కెమికల్ వ్యర్థాలతో నిండిన ఓ ట్యాంకర్ వెంచర్‌లోకి వెళ్తుండటం గమనించి మెల్లగా మోటారు సైకిళ్లతో వెంబడించారు. ట్యాంకర్‌తో పాటు ఓ వ్యక్తి కూడా ద్విచక్రవాహనంపై అక్కడికి చేరుకున్నాడు. వారిద్దరూ కలిసి కెమికల్ వ్యర్థ రసాయినాలను వెంచర్‌లోని ప్లాట్లలోకి వదిలేందుకు సిద్ధమయ్యారు. దీంతో గస్తీ కాస్తున్న యువకులు డ్రైవర్‌ను పట్టుకోగా ద్విచక్రవాహనంపై వచ్చిన మరో వ్యక్తి పరారయ్యాడు. దీంతో ప్లాట్ల యజమానులు, రైతులు అక్కడే ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న కొత్తపేట పోలీసులు అక్కడికి చేరుకుని ట్యాంకర్‌తో పాటుగా బీహార్ రాష్ట్రానికి చెందిన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

తెలంగాణ నుంచే కెమికల్ ట్యాంకర్

వెంచర్‌లో కెమికల్ వ్యర్థాలను డంప్ చేస్తున్నది తెలంగాణకు చెందిన ఓ కెమికల్ ఫ్యాక్టరీగా తెలుస్తోంది. సూర్యాపేటలోని ఓ ఫ్యాక్టరీ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా ఈ వ్యర్థాలను డంప్ చేసి వెళ్తున్నట్టు పోలీసులు భావిస్తున్నారు. పోలీసుల అదుపులో ఉన్న డ్రైవర్ బీహారీ కావడం అతడికి తెలుగు రాకపోవడంతో సమాచారంలో జాప్యం జరుగుతోంది. వ్యర్థాల డంపింగ్‌కు బీహారీని పంపిన వ్యక్తుల ఫోన్ నెంబర్లను కాంటాక్ట్ చేసేందుకు ప్రయత్నించగా స్విచ్ ఆఫ్ రావడంతో పోలీసులు మరోకోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వంద ఎకరాలపై దుష్ప్రభావం

ఏడాది కాలంగా గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న కెమికల్ వ్యర్థాల డంపింగ్ కారణంగా వెంచర్‌లోని సుమారు 100 ఎకరాలపై దుష్ప్రభావం పడింది. ఆయా స్థలాలన్ని కెమికల్ వ్యర్థాలతో నిండి తీవ్ర దుర్వాసన రావడమే కాకుండా భూముల రంగు మారిపోయింది. కొంతభాగం నల్లగాను, మరికొంత భాగం తెలుపు, గోధుమ రంగులతో మారిపోయి అటువైపు వెళ్లలేని విధంగా తయారయ్యాయి. సమీప బోర్ల నుంచి కూడా కలుషిత నీరు వస్తున్నట్టు అక్కడి వారు చెబుతున్నారు. డంపింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, ప్లాట్ల యజమానులు డిమాండ్ చేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు: డీఆర్‌వో

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలను (ఐపీఈ-2025) విజయవంతంగా నిర్వహించేందుకు సమన్వయ శాఖల అధికారులు బృంద స్ఫూర్తితో వ్యవహరించి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌వో) ఎం.లక్ష్మీ నరసింహం కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో డీఆర్‌వో లక్ష్మీ నరసింహం, జిల్లా ఇంటర్ విద్యాధికారి (డీఐఈవో) సీఎస్ఎస్ఎన్ రెడ్డితో కలిసి పరీక్షల నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఇంటర్ విద్య, పాఠశాల విద్య, రెవెన్యూ, పోలీసు, ప్రజా రవాణా, వైద్య ఆరోగ్యం, విద్యుత్, పోస్టల్ తదితర శాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌వో మాట్లాడుతూ ఇంటర్ వొకేషనల్, జనరల్ ప్రాక్టికల్ పరీక్షలు ఈనెల 5 నుంచి 20 వరకు 127 కేంద్రాల్లో జరుగుతాయని, అలాగే థియరీ పరీక్షలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. 41,295 మంది ఫస్టియర్ విద్యార్థులు, 39,564 మంది సెకెండియర్ విద్యార్థులు మొత్తం 80,859 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు వివరించారు. పరీక్షల నిర్వహణకు సంబంధించి చీఫ్ సూపరింటెండెంట్లు, కస్టోడియన్ అధికారులను నియమించడం జరిగిందని, 27 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష పత్రాలను స్టోరేజ్ పాయింట్ల నుంచి కేంద్రాలకు తరలింపు మొదలు ప్రతి దశలోనూ అప్రమత్తంగా ఉండాలన్నారు. బందోబస్తు ఏర్పాటు, భద్రతా చర్యలు, సీసీ కెమెరాల నిఘాలో పోలీసు శాఖతో సమన్వయం అవసరమన్నారు. 20 కేంద్రాలకు ఒకటి చొప్పున ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ఏర్పాటుకు అధికారులు, సిబ్బందిని సిద్ధం చేయాలన్నారు. విద్యార్థులు సకాలంలో పరీక్షా కేంద్రానికి చేరుకొనేలా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలన్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని డీఆర్‌వో సూచించారు. స్పెషల్ ఆఫీసర్ ఎస్.సరళకుమారి, డీఈసీ సభ్యులు జి.ఝాన్సీ, డీఈవో యూవీ సుబ్బారావు, ఏపీఎస్ ఆర్టీసీ అధికారి కె.సురేష్ కుమార్, పోస్టల్ సీనియర్ సూపరింటెండెంట్ ఎం.నరసింహాస్వామి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీసు షేక్ అహ్మద్ అలీ, విద్యుత్ శాఖ ఈఈ ఎ.శ్రీనివాసరావు పాల్గొన్నారు.


డీఐఈవోతో కలిసి సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో లక్ష్మీ నరసింహం

ఎస్సీ, ఎస్టీ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు

● కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ ఎస్టీకేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మీకోసం సమావేశ పుహాలులో విజిలెన్స్ అండ్ పర్యవేక్షణ కమిటీ సమావేశం ఎస్పీ ఆర్ గంగాధరరావుతో కలిసి సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డివిజన్ల వారీగా కేసులు పెండింగ్ ఉండటానికి గల కారణాలపై సమీక్ష నిర్వహించారు. కేసులను సత్వరమే పరిష్కరించేందుకు డివిజన్ స్థాయిలో కమిటీలను వేయాలని ఆదేశించారు. ఎస్పీ గంగాధరరావు మాట్లాడుతూ పోలీస్, రెవెన్యూ అధికారులు ఎస్సీ ఎస్టీ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 480



అవార్డు అందుకుంటున్న నాగుల్ మీరావలీ

అధ్యాపకుడు నాగుల్ మీరావలికి అవార్డు

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కొబ్బరిచెట్టు వేర్లతో మూర్ఛ వ్యాధికి చికిత్స అంశంపై వి.వి.ఐ.పి.ఎస్ ఫార్మశీ కళాశాల అధ్యాపకుడు ఎస్‌కె.నాగుల్ మీరావలీకి అంతర్జాతీయ అవార్డు లభించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు తెలిపారు. విజ్ఞాన్ ఫార్మశీ కళాశాలలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రజంటేషన్ ఇచ్చి అవార్డును సాధించారన్నారు. నాగుల్ మీరావలీని కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అమీనాబీ, పి.రవీష, టి.ప్రశాంతి, టి.బాలకృష్ణ, బి.సత్యశ్రీ, టి.శ్రావణి, వి.ఎల్.వినోద్, ఎ.సాయిధాత్రి, వి.రజని, కె.పరిమళ అభినందించారు.



వాహనదారులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై చంటిబాబు

హెల్మెట్ వాడకంతో ప్రాణరక్షణ

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గుడివాడ రూరల్ ఎస్సై చంటిబాబు వాహనదారులకు సూచించారు. మల్లాయపాలెం అడ్డరోడ్డు వద్ద వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ప్రయోజనాలపై ఆయన అవగాహన కల్పించారు. మనిషి శరీరంలో ఏ భాగానికి గాయం అయినా ప్రాణానికి ప్రమాదం ఉండదని, తల భాగం చాలా సున్నితంగా ఉంటుందని తెలిపారు. తలభాగానికి రక్షణగా నిలిచే హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలను ప్రజలకు వివరించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పెదపారుపూడి రైతులు

వ్యవసాయ భూమిలో విద్యుత్ స్తంభాలు వేయొద్దని వినతి

పెదపారుపూడి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ భూమిలో 400 కేవీ విద్యుత్ స్తంభాలు వేయవద్దని కోరుతూ పెదపారుపూడి గ్రామ రైతులు తహసీల్దార్ వై.రంగారావుకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నాట్లు వేయాలన్నా, దమ్ము చేయాలన్నా ఆ స్తంభాల వల్ల అనేక ఇబ్బందులు కలుగుతున్నాయని తెలిపారు. కరెంట్ స్తంభాలు వేయటం నిలిపివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు నాగేశ్వరరావు, కాకరాల గాంధీ, రైతులు పాల్గొన్నారు.



విజేతలైన మొవ్వ జడ్పీ పాఠశాల విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీలు

గ్రిగ్ పోటీల్లో ఓవరాల్ చాంప్ మొవ్వ జడ్పీ

కూచిపూడి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పమిడిముక్కల జడ్పీ పాఠశాలలో నిర్వహించిన పామర్రు సబ్ జోన్ గ్రిగ్ మెమోరియల్ క్రీడా పోటీల్లో మొవ్వ జడ్పీ పాఠశాల విద్యార్థులు ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించారు. పాఠశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో విజేతలైన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన పీడీలు అప్పికట్ల రామారావు, మండలి మనోహరిలకు పాఠశాల విద్యాకుటుంబం అభినందనలు తెలిపింది. ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయులు ఎస్.శ్రీదేవి, పాఠశాల కార్యదర్శి జాకీర్ అహ్మద్, పి.శివకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విజేతలైన విద్యార్థులతో ఎంఈవో డేవిడ్ రాజు, పాఠశాల కమిటీ చైర్మన్ నాగరాజు, హెచ్‌ఎం ప్రసాద్ తదితరులు

తమిరిశ జడ్పీ విద్యార్థుల ప్రతిభ

నందివాడ, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రిగ్ మెమోరియల్ ఆటల పోటీల్లో తమిరిశ జిల్లా పరిషత్ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎంఎల్.కె.వి.వి.ప్రసాద్ తెలిపారు. గ్రిగ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ఎంఈవో డేవిడ్ రాజు, చైర్మన్ నాగరాజు సత్కరించి, పతకాలు అందజేశారు. శిక్షణ ఇచ్చిన ప్రసాద్, మహేష్‌లను సత్కరించినట్లు పాఠశాల హెచ్‌ఎం ప్రసాద్ తెలిపారు.



సబ్‌జోన్ పోటీల్లో కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించిన అగినపర్రు పాఠశాల విద్యార్థినులు

కబడ్డీలో అగినపర్రు విద్యార్థినులకు ద్వితీయ స్థానం

పమిడిముక్కల, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పామర్రు నియోజకవర్గ సబ్‌జోన్ ఆటల పోటీల్లో అగినపర్రు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కబడ్డీలో ద్వితీయ స్థానం సాధించారు. తాడంకి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగి పోటీల్లో అగినపర్రు విద్యార్థినులుప్రతిభ కనబరచి ద్వితీయ స్థానం సాధించారు. ఈసందర్భంగా పాఠశాలలో సోమవారం ఏర్పాటుచేసి కార్యక్రమంలో విద్యార్థినులను హెచ్‌ఎం ఫణికుమార్ అభినందించారు. పీఈటీ లేకపోయినప్పటికి ఇన్‌చార్జ్ పీఈటీగా ఉన్న ఆంగ్ల ఉపాధ్యాయుడు కె రవిబాబు శిక్షణలో విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించడం ప్రశంసనీయమన్నారు.





గుడ్లవల్లేరులో సరస్వతీ విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ఆలయ ప్రదక్షణ చేస్తున్న భక్తులు





ఐనంపూడిలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

గుడ్లవల్లేరు, ఐనంపూడిలో ప్రతిష్ఠామహోత్సవం

గుడ్లవల్లేరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వేద పండితుల మంత్రోచ్ఛరణ, భక్తుల జయజయధ్వానాల నడుమ సోమవారం ఉదయం 11.49 గంటలకు గుడ్లవల్లేరు సిద్ధేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మించిన ఉపాలయంలో సరస్వతి అమ్మవారి పంచలోహ విగ్రహ ప్రతిష్ఠ, సరస్వతీ యంత్రం, శిఖర ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సరస్వతీ హోమం, గర్భాలయ సంప్రోక్షణ, గర్తన్యాసం, వేదపండితులు జోశ్యుల కార్తీకేయశర్మ బృందం ప్రతిష్ఠా మహోత్సవం జరిపారు. అనంతరం ఐదు వేల మంది భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. ఏపీ స్టేట్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కొసరాజు బాపయ్య చౌదరి, కొసరాజు వెంకటాద్రి (పెదబాబు), వల్లభనేని వెంకటరావు, గుత్తికొండ సుభాష్ చంద్రబోస్, పాతూరి వెంకటేశ్వరరావు (బుజ్జి), అడుసుమిల్లి వీరభద్రరావు, అన్నే ప్రసాదరావు, పోలవరపు వెంకటరావు, కోలా రాధాకృష్ణ, మూల్పూరి సుధాకర్, అట్లూరి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఐనంపూడిలో..

పమిడిముక్కల : ఐనంపూడిలో పునర్నిర్మించిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో విగ్రహ, శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. శతాబ్దాల చరిత్ర కలిగిన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయం జీర్ణోద్ధరణ కాగా గ్రామస్తులు, భక్తుల పరిపూర్ణ సహాయ సహకారాలతో నూతనంగా నిర్మాణం చేశారు. వేణుగోపాలస్వామి, క్షేత్రపాలక వీరాంజనేయస్వామి, గోదాదేవి, గరుడమూర్తుల నూతన విగ్రహాల ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి కల్యాణ వైభవంగా నిర్వహించారు. ఐనంపూడి పరిసర గ్రామాలతో పాటు ఉమ్మడి జిల్లాలో పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, ఎస్సై బీ శ్రీను సిబ్బందితో బందోబస్తు పర్యవేక్షించారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు కార్యదర్శులు కృషి చేయాలని డీఎల్‌డీవో సుజాత అన్నారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల్లో అభివృద్ధి పనులు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం అంశాలపై సమావేశం జరిగింది. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించటానికి కార్యదర్శులు కృషి చేయాలని కోరారు. గ్రామాల్లో ఎవరైనా తప్పిపోయిన కేసులు ఉంటే వాటి వివరాలు తెలియజేయాలన్నారు. తాగునీటిసమస్యలు తలెత్తకుండా పంచాయతీ చెరువులను నీటితో నింపుకోవాలని తెలిపారు. ప్రతి కార్యదర్శి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి తాగునీటి చెరువులను నింపి ఫొటోలతో సహా తమకు పంపించాలని కోరారు. ఎట్టి పరిస్థితుల్లో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వై.విష్ణుప్రసాద్, ఈవోపీ ఆర్డీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీవో సుజాత, ఇతర అధికారులు



పెదముత్తేవిలో సరస్వతీదేవికి పూజలు చేస్తున్న విద్యార్థులు



రూ.70 వేల చెక్కును కమిటీకి అందజేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి వేడుకలు

● ఆలయాల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం

కూచిపూడి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలంలోని పలు పాఠశాలల్లో వసంత పంచమి వేడుకలను సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెదముత్తేవి, కాజ, కోసూరు, మొవ్వ జడ్పీపాఠశాలల్లోనూ, కొండవరం ఎంపీ ఎలిమెంటరీ పాఠశాలలో గల సరస్వతీ దేవి విగ్రహానికి విద్యార్థులు పూలమాలలు వేసి పూజలు నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు.

పమిడిముక్కల : వసంత పంచమి పురస్కరించుకుని మామిళ్లపల్లి సరస్వతీదేవి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పలు ప్రాంతాలనుంచి భక్తులు తరలి వచ్చి సరస్వతీదేవికి పూజలు చేశారు.

హిందూ దేవాలయాల అభివృద్ధికి దాతలు మరింత సహకరించాలి

పామర్రు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవాలయాల అభివృద్ధికి దాతలు మరింత ముందుకు వచ్చి సహకరించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. గుడివాడ రోడ్డు పాండు బడ్డీ సెంటర్లోగల శ్రీ వీరాంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి నిమిత్తం కురుమద్దాలి గ్రామ విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు వివిఎస్ ప్రసాద్ వితరణగా అందజేసిన రూ.70 వేల నగదు చెక్కును ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా చేతుల మీదుగా సోమవారం ఆలయ కమిటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మండపాక రంగారావు, జనసేన ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, వల్లూరిపల్లి గణేష్ కురుమద్దాలి గ్రామానికి చెందిన కె.రామకృష్ణ, కె.వెంకటేశ్వరరావు, దాలిపర్తి ప్రసాద్ తదితర్లు పాల్గొన్నారు.

తోట్లవల్లూరులో 30 పడకల ఆసుపత్రి నిర్మిస్తాం

తోట్లవల్లూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామసేవయే రామసేవ అని చెప్పిన బాబా స్ఫూర్తితో తోట్లవల్లూరులో ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించే విధంగా 30 పడకల ఆస్పత్రిని ఏడాదిలో నిర్మిస్తామని గ్లోబల్ హ్యూమనిటేరియన్ మిషన్ వ్యవస్థాపకులు శ్రీ సద్గురు మధుసూదన్ సాయి ప్రకటించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పొట్లూరి రాజమోహన్ ఆహ్వానంపై సోమవారం మధుసూదన్ సాయి తోట్లవల్లూరు వచ్చారు. శ్రీవేణుగోపాలస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి తదితరులతో కలిసి స్థానిక జడ్పీ హైస్కూల్‌ని సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు మధుసూదన్ సాయికి ఘన స్వాగతం పలికారు. హైస్కూల్లో జరిగిన సభలో మధుసూదన్ సాయి మాట్లాడుతూ, తోట్లవల్లూరుకు ఏదైనా సేవ చేయాలని తనను పొట్లూరి రాజమోహన్ ఆహ్వానించారని, ఆ బాబా సంకల్పంతో రావటం జరిగిందన్నారు. బాపట్లలో నిర్మించిన విధంగా ప్రజల సహకారంతో తోట్లవల్లూరులో 30 పడకల ఆస్పత్రి నిర్మించి అందిస్తామని, సత్యసాయి బాబా శత వసంతాల ఉత్సవం కూడా ఈ ఏడాది నవంబర్‌లో రానుందని, ఇది బాబా సంకల్పమని మధుసూదన్ సాయి పేర్కొన్నారు. ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ, పేదవారికి సేవ చేయాలన్న ఆశ కలిగిన మధుసూదన్ సాయి తోట్లవల్లూరు రావటం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. సాయిని పొట్లూరి రాజమోహన్, ఎమ్మెల్యే కుమార్ రాజా, గురుమూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ పూలమాలలతో సత్కరించి గౌతమ బుద్ధిని ప్రతిమను బహూకరించారు. జడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, పెద్ద పాపారావు పాల్గొన్నారు.



తోట్లవల్లూరు జడ్పీ హైస్కూల్లో మాట్లాడుతున్న సద్గురు మధుసూదన్‌సాయి

తైక్వాండోలో కానూరు స్కాట్స్‌పైన్ విద్యార్థికి కాంస్యం

పెనమలూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కానూరు స్కాట్స్‌పైన్ ఇంటర్నేషనల్ పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థిని పర్ణీతకు ఏడవ జాతీయ క్యురుగి, పూమ్సే తైక్వాండో ఛాంపియన్‌షిప్ బాలికల విభాగంలో జాతీయ స్థాయిలో కాంస్య పతకాన్ని సాధించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. గత నెల 28నుంచి 30వరకు హైదరాబాద్ కోట్ల విజయ భాస్కరరెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన ఈ పోటీల్లో విద్యార్థిని ఈ పతకాన్ని సాధించినట్లు తెలిపారు. విజేతను రవీంద్రభారతి సంస్థల చైర్మన్ వీరమాచనేని వంశీకృష్ణ, డైరక్టర్ శాంతి, సీఈఓ కొడాలి జాహ్నవి, ప్రిన్సిపాల్ చలసాని ప్రతిమలు అభినందించారు.



విజేతతో పాఠశాల యాజమాన్యం

వీరమ్మ తిరునాళ్లపై ఆర్డీవో సమీక్ష

ఉయ్యూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లలో ఏవిధమైన అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా ముగిసేలా ఆలయ కమిటీ, అధికారులు చర్యలు తీసుకోవాలని ఉయ్యూరు ఆర్డీవో హెలా షారోన్ అన్నారు. ఈ నెల 8 నుంచి వీరమ్మ తిరునాళ్ల ప్రారంభం కానున్న నేపథ్యంలో సోమవారం ఆలయ ప్రాంగణాన్ని తహసీల్దార్ సురేశ్ కుమార్, ఎంపీడీవో శేషగిరిరావు ఇతర అధికారులతో కలసి పరిశీలించారు. నగర పంచాయతీ కమిషనర్ వెంకటేశ్వరరావు, ఎస్సై విశ్వనాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో హెలా షారోన్

నెప్పల్లిలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ

కంకిపాడు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నెప్పల్లిలో ఆదివారం అర్ధరాత్రి ఘర్షణ నెలకొంది. నువ్వా నేనా అంటూ ఇరు వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట చోటు చేసుకుంది. సంఘటన స్థలానికి చేరుకున్న రెవెన్యూ, పోలీసులు ఇరు వర్గాలకు నచ్చ చెప్పి పంపించి వేశారు. నెప్పల్లిలో పంచాయతీ పోరంబోకు స్థలంలో ఎస్సీ వర్గానికి చెందిన పలువురు అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు పూనుకున్నారు. దీంతో మైనార్టీ కుటుంబాలు మా నివాసాల మధ్య విగ్రహం ఏర్పాటు చేయడం ఏంటంటూ ఎస్సీ నాయకులను నిలదీశారు. దీంతో విగ్రహ ఏర్పాటు విషయమై ఇరువర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. సమాచారం అందుకున్న తహసీల్దార్ భవన్నారాయణ, వీఆర్వో రఘురామ ప్రసాద్, సీఐ మురళీకృష్ణ, ఎస్సై సందీప్, తాతాచార్యులు సిబ్బందితో కలిసి హుటాహుటిన నెప్పల్లి చేరుకుని ఇరువర్గాలతో చర్చించి శాంతిపంజేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.480

తాళ్లపాలెం పీహెచ్‌సీ డీఎంహెచ్‌వో శర్మిష్ఠ తనిఖీ



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బంది కచ్చితమైన సర్వే నిర్వహించి వాస్తవాలను తెలియచేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి శర్మిష్ఠ అన్నారు. తాళ్లపాలెం లోని పీహెచ్‌సీని సోమవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలిం చారు. రోగులకు మందులు ఎలా అందుతున్నాయో అడిగి తెలుసుకున్నారు.



శేషవాహనంపై ఊరేగుతున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి శేషవాహనోత్సవం

మోపిదేవి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి సుబ్రహ్మణ్యే శ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు సోమవారం శేషవాహనంపై గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు ప్రత్యేక పూజలు చేసి కొబ్బరికాయ కొట్టి శేషవాహనోత్సవాన్ని ప్రారంభించారు. మోపిదేవి నుంచి రావివారిపాలెం వరకు పురవీధుల్లో స్వామివారు ఊరేగుతూ తరలివస్తుండగా, భక్తులు, గ్రామస్థులు కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ సమర్పించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మోపిదేవికి చెందిన భక్తబృందం ఏర్పాటు చేసిన మురళీకోలాటం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



డీఆర్కే దంపతులకు విరాళం అందిస్తున్న దేవాంగ పెద్దలు

శ్మశానవాటిక అభివృద్ధికి దేవాంగులు రూ.2.85 లక్షల విరాళం

చల్లపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ చల్లపల్లి ఆధ్వర్యంలో మన కోసం మనం ట్రస్ట్ ద్వారా చల్లపల్లిలో జరుగుతున్న శ్మశానవాటిక అభివృద్ధికి దేవాంగుల కుటుంబ సభ్యులు తమవంతు సహకారం అందించారు. పడమరవీధిలోని 120 దేవాంగుల కుటుంబాల్లోని ప్రతి ఒక్కరూ భాగస్వాములై రూ.2.85 లక్షల నగదును సమీకరించారు. స్వచ్ఛ చల్లపల్లి సారథులు డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి దంపతులను సోమవారం కలిసి విరాళం నగదును అందజేశారు. శ్మశానవాటిక అభివృద్ధికి తమవంతు సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ భాగస్వాములై సహకారం అందించటం పట్ల వైద్యదంపతులు కృతజ్ఞతలు తెలిపారు.



లక్ష రూపాయలను హేశ్విత వైద్యం కోసం తహసీల్దార్ వనజాక్షి ద్వారా అందజేస్తున్న ఐవీఎం డైరెక్టర్ వేములపల్లి సురేష్

తలసేమియా బాధిత చిన్నారికి ఐవీఎం సురేష్ రూ.లక్ష సాయం

చల్లపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ ద్వారా డా.వేములపల్లి సురేష్ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని తహసీల్దార్ డి.వనజాక్షి అన్నారు. ఉయ్యూరుకు చెందిన తలసేమియా బాధిత చిన్నారి తొండమల్లి హేశ్విత వైద్యం కోసం లక్ష రూపాయల చెక్కును తహసీల్దార్ చేతులమీదుగా చిన్నారి తల్లికి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఐవీఎం సురేష్ అందజేశారు. పుట్టుకతో తలసేమియాతో బాధపడుతున్న ఐదేళ్ల చిన్నారి హేశ్వితకు వైద్యఖర్చుల కోసం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ద్వారా సీఎంఆర్ఎఫ్ సహాయం రూ.10లక్షలు మంజూరు కాగా, మరో రూ.15 లక్షలు అవసరం ఉన్న నేపథ్యంలో సమస్యను తెలుసుకున్న ఐవీఎం సురేష్ స్వచ్ఛందంగా ముందుకువచ్చి లక్షరూపాయలు సహాయం అందించటం స్ఫూర్తిదాయకమన్నారు. ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, వక్కలగడ్డ సొసైటీ మాజీ ఛైర్మన్ హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, మల్లుపెద్ది రాణీకుమారి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించాలి

పెడన, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు ఘన విజయం చేకూర్చాలని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. తోటమూలలోని టీడీపీ కార్యాలయంలో సోమవారం వార్డు, బూత్, క్లస్టర్ ఇన్‌చార్జిలతో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి పట్టభద్ర ఓటరును కలసి ఆలపాటికి భారీ మెజారిటీ వచ్చేలా కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పట్టభద్రులకు వివరించాలన్నారు. ఎమ్మెల్సీ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు గొట్టుముక్కల రామకృష్ణంరాజు మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికలలో మాదిరిగా కూటమి శ్రేణులు సమన్వయంతో పనిచేసి ఆలపాటిని గెలిపించాలన్నారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, నియోజకవర్గ పరిశీలకుడు సాదరబోయిన ఏడుకొండలు, బీజేపీ జిల్లా కార్యదర్శి పుప్పాల రామాంజనేయులు, టీడీపీ నాయకులు పోతన స్వామి, శలపాటి ప్రసాద్, కూనపరెడ్డి వీరబాబు, వడుగు తులసీరావు, జనసేన పార్టీ నాయకులు పంచకర్ల సురేష్, దాసరి సత్యనారాయణ, ఊసా వెంకయ్య పాల్గొన్నారు.

చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా ర్యాలీ

నాగాయలంక, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : చిత్తడి నేలలు నీటి శుద్ధి కేంద్రాలని, నీటి నాణ్యతను కాపాడతాయని నాగాయలంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వి.న్.ప్రసాదరావు అన్నారు. చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా పాఠశాలలో నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు కో-ఆర్డినేటర్ కొమ్మినేని ఉదయ కుమార్ చిత్తడి నేలలు వర్షపు నీటిని భూగర్భానికి చేరుస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడతాయన్నారు. సైన్స్ ఉపాధ్యాయులు పద్యాల రఘురామయ్య, స్టాఫ్ సెక్రటరీ గాజుల లక్ష్మీ ప్రసాద్, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.



బందరులో ఆదివనమలమ్మ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠలో భక్తజనం



చల్లపల్లి నారాయణరావు నగర్‌లో వరసిద్ధి వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

వనమలమ్మ, వినాయక విగ్రహాల ప్రతిష్ఠ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నిజాంపేటలో పునర్నిర్మించిన ఆలయంలో ఆది వనమలమ్మ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా జరిగింది. వేదపండితులు రాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు ప్రతిష్ఠామహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం శాంతి కల్యాణం నిర్వహించి, అన్నదానం జరిపారు. ఆదివనమలమ్మ దేవాలయం పునః ప్రతిష్ఠా కార్యక్రమంలో మంత్రి రవీంద్ర పాల్గొన్నారు. మంత్రిని ఆలయ పాలకవర్గ సభ్యులు దుశ్శాలువాలతో సన్మానించారు. కొనకళ్ల బుల్లయ్య, గోపు సత్యనారాయణ, ఆళ్ల రాజా తదితరులు పాల్గొన్నారు. రుద్రవరంలోని రామాలయం, షిరిడిసాయిబాబా దేవాలయ ప్రతిష్ఠలో మంత్రి కొల్లు రవీంద్ర, వెంకయ్య, తూమాటి బసవయ్య పాల్గొన్నారు.



రవీంద్రను సత్కరిస్తున్న వనమలమ్మ దేవాలయం కమిటీ



బోడగుంట సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భక్తుల పూజలు

వరసిద్ధి వినాయక విగ్రహ ప్రతిష్ఠ

చల్లపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : నారాయణ రావునగర్ కాలనీలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో వరసిద్ధి వినాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఉదయం గం.11.42లకు నల్లూరు దాశరథి శ్రీనివాస దీక్షితుల బ్రహ్మత్వంలో వైభవంగా నిర్వహించారు. ఆరుగురు దంపతులు పీటలపై కూర్చుని ప్రతిష్ఠా మహోత్సవాన్ని జరిపారు. వరసిద్ధి వినాయక స్వామిని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ పెద్దలు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సత్కరించారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, కమిటీ పెద్దలు చాట్రగడ్డ శ్రీనివాసుడు, మిలటరీ కృష్ణ, బెల్లంకొండ అర్జునరావు, టీడీపీ నేతలు తదితరులు న్నారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. సుమారు ఐదువేల మందికి పైగా భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.



విఘ్నేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే మండలి



సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కాగిత

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

పెడన/పెడన రూరల్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : జన్యావుల వంశీయుల ఆధ్వర్యంలో లంకలకలవగుంట శివారు బోడగుంట గ్రామంలో సోమవారం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎమ్మె ల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించి తరించారు. కళ్యాణం అనంతరం అన్నసమారాధన జరిగింది. ఆలయ నిర్వాహకులు జన్యావుల శివాజీ, రామాంజనేయులు పర్యవేక్షించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధురాలి దుర్మరణం

పెడన, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి రోడ్డులోని చూజీ కంపెనీ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి చెందింది. తూర్పుతెలుగుపాలెంకు చెందిన మర్రి శేషమ్మను చూజీ కంపెనీ వద్ద సోమవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడి కక్కడే మృతి చెందింది. ఆమె మృత దేహం మీదుగా మరికొన్ని వాహనాలు పోవడంతో మృతదేహం నుజ్జునుజ్జయింది. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై జి.సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ పెయింటర్ మృతి

పెడన, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : పెయింటింగ్ పనులు చేస్తూ జారి కిందపడి గాయపడ్డ యువకుడు సోమవారం మృతి చెందాడు. కాకినాడ జిల్లా పెదపూడి మండలం కైకవోలు గ్రామానికి చెందిన పి. అరవిందకుమార్ (19)ఈనెల 29న పెడన మండలం చేవేంద్ర గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయానికి పెయింటింగ్ చేస్తూ ప్రమాదవశాత్తూ జారి కిందపడ్డాడు. అతన్ని చికిత్స నిమిత్తం తొలుత మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయవాడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఏఎస్సై సురేష్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆసుపత్రి భవనానికి శంకుస్థాపన

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : బుట్టాయిపేటలో మెయిన్ రోడ్డు పక్కన నూతనంగా నిర్మించే ప్రేమ్ హృద్రోగ ఆసుపత్రి భవనానికి సోమవారం భూమిపూజ చేశారు. మాజీ డిప్యూటీ స్పీకర్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, తోట రామకృష్ణ, డాక్టర్ ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.



మోపిదేవిలో చిన్నారులకు అక్షరాభ్యాసం గావిస్తున్న అర్చకులు



భావదేవరపల్లిలో సరస్వతీదేవికి పూజలు చేసిన విద్యార్థులు

ఆలయాల్లో సామూహిక అక్షరాభ్యాసం

మోపిదేవి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): వసంత పంచమి సరస్వతీ అమ్మవారి జన్మనక్షత్రం పురస్కరించుకుని మోపిదేవిలోని సకలేశ్వరస్వామి ఆలయంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. వందలాది మంది చిన్నారులకు అర్చకులు పెల్లూరి వెంకటేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించి అక్షరాభ్యాసం నిర్వహించారు. సరస్వతీ అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం గావించటం ఎంతో సంతోషదాయకమని చిన్నారుల తల్లిదండ్రులు వాపోయారు.

నాగాయలంక : వసంత పంచమిని సోమవారం విద్యార్థులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పాఠశాలలోని విద్యాదేవియైన సరస్వతీకి ఉపాధ్యాయులు, విద్యార్థులు విశేష పూజలు చేశారు. చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలను గురువులు చేయించారు. భావదేవరపల్లిలో విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవాలయం వద్ద ధర్మకర్త పూషడపు నిరంజనరావు ఆధ్వర్యంలో జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న 6,7,8,9 తరగతుల విద్యార్థులతో సామూహిక సరస్వతీదేవి పూజలు నిర్వహించారు.

హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాలి

పెడన, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు చైతన్యవంతులై హిందూ ధర్మాన్ని పర్యవేక్షించుకోవాలని చైతన్య వేదిక ప్రాంత సహ సంయోజక్ అంబటి మారుతీరాయ్ పిలుపునిచ్చారు. అగస్తేశ్వర స్వామి ఆలయంలో సోమవారం హిందూ చైతన్య వేదిక కార్యకర్తల సమావేశం జరిగింది. మారుతీరాయ్ మాట్లాడుతూ, హిందూ సంస్కృతి, సంప్రదాయాలపై దాడి జరుగుతోందని ఆరోపించారు. హిందూ ధర్మాన్ని కాపాడేందుకే హిందూ చైతన్య వేదిక ఆవిర్భవించిందన్నారు. హిం దూ దేవాలయాలకు చెందిన లక్షలాది ఎకరాలు ఆక్రమణలకు గురయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకోవడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. హిందూ చైతన్య వేదిక ప్రచార విభాగ్ ప్రముఖ్ ఎస్.వి. కనకదుర్గ మాట్లాడుతూ, ధర్మాన్ని మనం రక్షిస్తే ధర్మం మనల్ని రక్షిస్తుందన్నారు. హిందూ ధర్మానికి కలుగుతున్న హానికి, గోవధకు, దేవాలయ భూముల ఆక్రమణకు వ్యతిరేకంగా చైతన్యవేదిక కార్యకర్తలు పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. చైతన్యవేదిక నాయకులు అర్జునరావు, సుజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. హిందూ బంధువుల ఐక్యవేదిక ఛైర్మన్ నాదెళ్ళ కోటేశ్వరరావు (కోటి)ను హిందూ చైతన్య వేదికజిల్లా సంయోజక్‌గా నియమించారు. కోటేశ్వరరావును సత్కరించారు.

అరుదైన నాయకుడు అండ్రాజు

కోడూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): అరుదైన నాయకుడు అండ్రాజు వెంకట సుబ్బారావు అని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. సాలెంపాలెం శివారు వేణుగోపాలపురంలో గ్రామ ప్రముఖులు, మాజీ పీపీసీఎస్ అధ్యక్షులు, గ్రామ సర్పంచ్ అండ్రాజు బేబీ సరోజిని భర్త స్వర్గీయ అండ్రా జు వెంకట సుబ్బారావు సంస్మరణ సభ జరిగింది. వెంకట సుబ్బారావు (వెంకటేశ్వరరావు) చిత్రపటానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ ఛైర్మన్ చిలకలపూడి పాపారావు నివాళులర్పించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ నీతి, నిజాయితీలతో నిస్వార్థంగా గ్రామ అభివృద్ధి ప్రధాన ధ్యేయంగా సేవలు అందించిన అండ్రాజు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయులయ్యారని అన్నారు. జనసేన పార్టీ మత్స్యకార విభాగం రాష్ట్ర కార్యదర్శి లంకే యుగంధర్, రాష్ట్ర నాయకులు అండ్రాజు శ్రీనివాసరావు, జనసేన పార్టీ సీనియర్ నాయకులు బచ్చు వెంకటనాథ్ ప్రసాద్, పార్టీ మండల అధ్యక్షులు మర్రే గంగయ్య, టీడీపీ మత్స్యకార విభాగం రాష్ట్ర నాయకులు లకనం నాగాంజనేయులు, ఎంపీటీసీ సభ్యుడు లంకే భాస్కరరావు, కొప్పనాతి సత్యనారాయణ, కోలా బాలాజీ, నడకుదుటి రాధాకృష్ణమూర్తి, పూతబోయిన సీతారత్న సాయిబాబు, కాగిత రామారావు, పూతబోయిన కరుణకుమార్, కూరాకుల చంద్రశేఖర్, కూరాకుల కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు. పిట్టల్లంకలో జనసేన పార్టీ నాయకుడు, వార్డుసభ్యు లు నడకుదుటి రత్న ఆంజనేయులును ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పరామర్శించారు. ఆంజనేయులు తండ్రి నడకుదుటి రాజేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, రత్న ఆంజనేయులును పరామర్శించి ధైర్యం చెప్పారు.



అండ్రాజు వెంకట సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మండలి

నాగాయలంకలో పరామర్శ

నాగాయలంక, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): నాగాయలంకలో పలువురిని ఎమ్మెల్యే మండలి పరామర్శించారు. తలశిల లీలా కృష్ణ, హరిబాబుల నాయనమ్మ కృష్ణవేణమ్మ ఇటీవల మృతి చెందగా, వారిని పరామర్శించారు. తలశిల నీలమ్మ మృతి చెందగా, కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆ డీసీ ఛైర్మన్ బండ్రెడ్డి నాగమల్లిఖార్జునరావు, టీడీపీ మండల అధ్యక్షులు మెండు లక్ష్మణరావు (చంటి), భావదేవరపల్లి సర్పంచ్ మండలి ఉదయభాస్కర్, నాగాయలంక ఉపసర్పంచ్ తలశిల వెంకట నరసింహారావు (నాని), టీడీపీ నేతలు ఉప్పల ప్రసాద్, లకనం నాగాంజనేయులు, తలశిల శివరామకృష్ణ, రేమాల సుబ్బారావు, జనసేన నాయకులు బావిరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాయి ఫణి సంతోష్‌కు అభినందన



మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలోని టెక్సాస్ విశ్వవిద్యాలయం నుంచి మాస్టర్ లా చేసిన లంకిశెట్టి సాయి ఫణి సంతోష్‌ను సోమవారం రాష్ట్ర బీసీ నాయకులు కొనకళ్ల బుల్లయ్య, టీడీపీ నాయకులు అభినందించారు. సంతోష్‌ను మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టీడీపీ కార్పొరేటర్లు చిత్తజల్లు నాగరాము, దింటకుర్తి సుధాకర్, మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ గోపు సత్యనారాయణ, డ్రగ్గిస్టు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి అంజిబాబు తదితరులు అభినందించారు. న్యాయవాది లంకిశెట్టి బాలాజీ , మాజీ కౌన్సిలర్ లంకిశెట్టి వనజను సత్కరించారు.

విజయా విద్యార్థులకు నేషనల్ మెరిట్ అవార్డులు



చల్లపల్లి, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి) : విజయా జూనియర్ కళాశాల విద్యార్థులు డా.అంబేద్కర్ నేషనల్ మెరిట్ అవార్డులకు ఎంపిక య్యారు. అత్యధిక మార్కులు సాధించిన కర్రా కృష్ణమోహన్ మెరిట్ అవార్డ్ విత్ సెకండ్ పొజిషన్ క్యాష్ ప్రైజ్ (రూ.50వేలు), దాసరి లక్ష్మీలహరి మెరిట్ అవార్డ్ స్పెషల్ పొజిషన్ క్యాష్ ప్రైజ్ (రూ.20వేలు)లకు ఎంపికయ్యారు. అవార్డు పొందిన విద్యార్థులు, తల్లిదండ్రులకు కళాశాల కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్ మెరిట్ అవార్డు పత్రాలు అందచేసి అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్స్ షేక్ అబ్దుల్ రహీం, పెమ్మసాని రమేష్‌బాబులు పాల్గొన్నారు.